TEL:T/TG/2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు — తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY

**విలేఖరులు కావలెను...**

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..
మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9533397954

పబ్లిషర్ : హైదరాబాద్ సంపుటి :01 సంచిక : 139 శనివారం 11-01-2025 పేజీలు :06 వేల : 05/-

# ఫ్యూచర్ సిటీ పేరుతో గొప్ప నగరాన్ని నిర్మిస్తాము

- పెట్టుబడులతో ముందుకు రండి
- ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అందిస్తాం
- జాతీయ కౌన్సిల్ సమావేశంలో సీఎం రేవంత్





**హైదరాబాద్ (మన వెలుగు) జనవరి 10 :** ఫ్యూచర్ సిటీ పేరుతో దేశంలోనే ఒక గొప్ప నగరాన్ని నిర్మించాలన్నది తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. న్యూయార్క్, లండన్, టోక్యో, సియోల్, దుబాయ్ లాంటి ప్రపంచ నగరాలతో పోటీ పడాలన్న ప్రభుత్వ ఆకాంక్షకు అనుగుణంగా పెట్టుబడులతో ముందుకు రావాలని పారిశ్రామిక వేత్తలకు ఆహ్వానం పలికారు. హైదరాబాద్‌లోని గ్రీన్ బిజినెస్ సెంటర్‌లో జరిగిన భారత పరిశ్రమల సమాఖ్య జాతీయ కౌన్సిల్ సమావేశంలో ముఖ్యమంత్రి గారు ప్రసంగిస్తూ, పారిశ్రామికాభివృద్ధిలో తెలంగాణ ప్రభుత్వ లక్ష్యాలను వివరించారు. తెలంగాణలో ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందడానికి, స్వేచ్ఛా వాణిజ్యం, మార్కెట్లు పనిచేయడానికి పారిశ్రామిక రంగం సహకరించాలని కోరారు. ప్రపంచంలోనే అత్యుత్తమ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అందించడానికి తెలంగాణ రాష్ట్రం సిద్ధంగా ఉందని చెప్పారు. "తెలంగాణ రైజింగ్ లక్ష్యంతో సేవల రంగం కేంద్రీకృతంగా ఫోర్త్ సిటీని నిర్మించాలన్నది ప్రభుత్వ ఆకాంక్ష. హైదరాబాద్‌లో సంపూర్ణంగా నెట్ జీరో లక్ష్యాలతో పనిచేస్తున్నాం. హైదరాబాద్ నగరాన్ని కాలుష్య రహిత నగరంగా మార్చడంలో భాగంగా 3200 ఆర్టీసీ బస్సుల స్థానంలో విద్యుత్ వాహనాలను సమకూర్చబోతున్నాం. ఎలక్ట్రిక్ వాహనాలపై రిజిస్ట్రేషన్, రోడ్ టాక్స్‌లను పూర్తిగా రద్దు చేశాం. ప్రస్తుతం ఎలక్టిక్ వాహనాల అమ్మకాలు అత్యంత వేగంగా పెరుగుతున్నాయి.వరదలు లేని నగరంగా, దేశంలోనే పర్యావరణ హితమైన హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో చర్యలు చేపట్టాం. అందులో భాగంగా 55 కిలోమీటర్ల పొడవైన మూసీ పునరుజ్జీవ పనులను ప్రారంభించాం. 2050 నాటికి అవసరమయ్యే తాగునీటి అవసరాలకు అవసరమైన కార్యాచరణను ఇప్పటి నుంచే ప్రారంభించాం.తెలంగాణ మణిహారంగా రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం చేపట్టాం. అవుటర్ రింగ్ రోడ్డుకు రీజినల్ రింగ్ రోడ్డుకు మధ్యన రేడియల్ రోడ్లను నిర్మించబోతున్నాం. ఆయా ప్రాంతాల్లో ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఏరోస్పేస్, డిఫెన్స్, ఈవీ, సోలార్ పవర్ వంటి పరిశ్రమలు అక్కడ ఏర్పాటు చేయబోతున్నాం. 360 కి.మీ పొడవు ఉండబోయే రీజినల్ రింగ్ రోడ్డు వెంట రీజినల్ రింగ్ రైల్‌ను నిర్మించాలని ప్రధానమంత్రి గారిని కోరాం. రీజినల్ రింగ్ రోడ్ చుట్టూ తయారీ పరిశ్రమ, మార్కెటింగ్ కు అవసరమైన కేంద్రీకృత ప్రదేశాలను ఏర్పాటు చేయాలన్నది మా ఉద్దేశం.చైనా తరహాలో రకరకాల క్లస్టర్లను సృష్టించాలని భావిస్తున్నాం. ఒక లైట్ సిటీ, మార్బుల్ సిటీ, గ్రానైట్ సిటీ, ఫర్నీచర్ సిటీ... ఇలా ప్రత్యేక తరహాలో రీజినల్ రింగ్ రోడ్డు చూట్టూ మార్కెటింగ్ కార్యకలాపాల విస్తరణకు ప్రయత్నిస్తున్నాం. రీజినల్ రింగ్ రోడ్ పూర్తయితే తెలంగాణ ప్రాంతంలో 70 శాతం పట్టణీకరణ జరుగుతుంది. రింగ్ రోడ్డు ఆవలివైపున గ్రామీణ తెలంగాణ సమగ్రాభివృద్ధి లక్ష్యంగా వ్యవసాయం, సేంద్రీయ సాగు, రైతుల కోసం గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజీల ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టి సారించింది. తెలంగాణకు సముద్ర తీరప్రాంతం లేని కారణంగా డ్రై పోర్టును ఏర్పాటు చేస్తున్నాం. పోర్టుతో అనుసంధానం చేయడానికి మచిలీపట్నం ఓడరేవు వరకు ప్రత్యేక రహదారి, రైల్వే కనెక్టివిటీని ప్రతిపాదించాం. నైపుణ్యత పెంచడానికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగుపరచడంపై ప్రధానంగా దృష్టి సారించాం. చైనా ప్లస్ వన్ వ్యూహంలో హైదరాబాద్‌ను ప్రపంచంలో ప్రధాన పెట్టుబడుల కేంద్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.సీఐఐ జాతీయ కౌన్సిల్ సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించడం శుభ పరిణామం. అత్యుత్తమ వ్యాపార సౌలభ్యాలను అందించడానికి తెలంగాణ సిద్ధంగా ఉంది. సీఐఐ కలిసిరావాలి. అందరం కలిసి అద్భుతాలు సాధించవచ్చని మా నమ్మకం" అని ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలను వివరించారు.ఈ సమావేశంలో సీఐఐ అధ్యక్షుడు సంజీవ్ పూరి, వైఎస్-ప్రెసిడెంట్ ఆర్. ముకుందన్, సీఐఐ డైరెక్టర్ చంద్రజీత్ బెనర్జీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ తో పాటు సీఐఐ ప్రతినిధులు, ఆయా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## నేటి నుంచి 20 కోచ్‌లతో సికింద్రాబాద్ విశాఖ వందే భారత్ ఎక్స్‌ప్రెస్



ప్రధాన మంత్రి నరేంద్ర మోడి చేతుల మీదుగా 15 జనవరి , 2023న మకర సంక్రాంతి పండుగ రోజున జెండా ఊపి ప్రారంభించబడిన విశాఖపట్నం - సికింద్రాబాద్ - విశాఖపట్నం వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రస్తుతం 16 కోచ్‌లతో 1,128 ప్యాసింజర్ల సామర్థ్యంతో సేవలను అందిస్తున్న ఈ రైలు రేపటి నుండి అనగా జనవరి 11, 2025 నుండి మెరుగైన 1414 ప్యాసింజర్ల సామర్థ్యంతో 20 కోచ్‌ల సవరించిన కూర్పుతో నడుస్తుంది. రైలు నం. 20833/20834 విశాఖపట్నం - సికింద్రాబాద్ - విశాఖపట్నం వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభంలో 16 కోచ్‌ల కూర్పుతో ప్రవేశపెట్టబడింది. ఇందులో 02 ఎగ్జిక్యూటివ్ క్లాస్ మరియు 14 చైర్ కార్లు ఉన్నాయి. సాధారణ సేవలను ప్రవేశపెట్టినప్పటి నుండి, రైలు స్థిరంగా 130% కంటే ఎక్కువ డిమాండ్ తో నడుస్తోంది. ఈ రైలుకు పెరిగిన విశేషమైన డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుని, రైల్వేలు ప్రస్తుతం ఉన్న రైలు రేక్‌ను మరో 4 అదనపు కోచ్‌లతో పెంచాలని నిర్ణయించింది. తదనుగుణంగా, ఈ రైలును 2025 జనవరి 11 నుండి ప్రస్తుత 16 కోచ్‌ల సామర్థ్యానికి బదులుగా 20 కోచ్‌ల సామర్థ్యంతో సేవలను అందించనుంది. నూతన సవరించిన కూర్పులో 1,336 మంది ప్రయాణికుల సామర్థ్యంతో 18 చైర్ కార్లు ఉంటాయి (అంతకుముందు 14 కోచ్ లతో 1024 సామర్థ్యంతో వుండేవి) మరియు 104 మంది ప్రయాణికుల సామర్థ్యం తో 02 ఎగ్జిక్యూటివ్ క్లాస్ ఉండి మొత్తం 20 కోచ్‌లలో 1440 మంది ప్రయాణికుల సామర్థ్యం తో సేవలను అందించనుంది. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ శ్రీ అరుణ్ కుమార్ జైన్ మరో 4 కోచ్‌ల జోడింపుతో వందేభారత్ రైలు సర్వీసు ప్రయాణం మరింత మంది ప్రయాణికులను చేరుకోగలదని తెలిపారు. ఈ సంక్రాంతి సీజన్‌లో కోచ్‌ల పెంపుదల కూడా సకాలంలో ఒక అదనపు అంశమని, ఈ సంక్రాంతి పండుగ రద్దీ సమయంలో ఎక్కువ మంది ప్రజలు తమ స్వస్థలాలకు వెళ్లి పండుగ జరుపుకోగలరని ఆయన అన్నారు.



# జగిత్యాల జిల్లా బిజెపి రథసారథి ఎవరు..?

**జగిత్యాల ప్రతినిధి (మన వెలుగు) జనవరి 10 :** ప్రస్తుతం జరుగుతున్న బిజెపి సంస్థగత ఎన్నికల్లో భాగంగా జగిత్యాల జిల్లా కొత్త రథసారథి ఎవరు అనేది జోరుగా చర్చలు సాగుతున్నాయి జిల్లా బిజెపిలో అధిష్టానం ఎవరికీ పగ్గాలు ఇస్తుందోనని కార్యకర్తలు మరియు నాయకులు యువకులు హిందుత్వ విలువలను కాపాడేవారు ఎవరని చర్చకు కేంద్ర బిందువు అయింది జిల్లాలో యువ నాయకునిగా సురభి నవీన్ కుమార్ పేరు వినిపిస్తుంది అలాగే బిజెపి నాయకురాలు భోగ శ్రావణి పేరు కూడా వినిపిస్తుంది అలాగే సీనియర్ నాయకుడు పైడిపెల్లి సత్యనారాయణ పేరు కూడా వినిపిస్తుంది అలాగే సీనియర్ నాయకులు ముదగంటి రవీందర్ రెడ్డి పేరు కూడా వినిపిస్తుంది ఈ నలుగురిలో ఎవరిని అధిష్టానం జిల్లా రథసారధిగా నియమిస్తుందో అని కార్యకర్తల్లో చర్చనీయాంశమైంది ఇదిలా ఉంటే ఆర్ఎస్ఎస్ కార్యకర్తగా ప్రస్థానాన్ని ప్రారంభించి హిందుత్వమే ఊపిరిగా ఉంటూ రాష్ట్ర నాయకునిగా కోరుట్ల నియోజకవర్గ నాయకులుగా పార్టీకి సేవలందించి కోరుట్ల నియోజకవర్గ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో తనకు రావలసిన బిజెపి పార్టీ టిక్కెట్టును అధిష్టానం నిజామాబాదు ఎంపీ ధర్మపురి అరవింద్ కు కేటాయించగా అరవింద్ కు సహకరిచారు అధిష్టానం ఆదేశం శిరసా వహిస్తూ హిందుత్వ వికాసానికి తనదైన శైలిలో నిత్యం కార్యకర్తల మధ్య ఉంటూ ఇటీవల బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ%శీ% అంత తిరుగుతూ దాదాపు 10వేల సభ్యత్వాలు చేయించి రాష్ట్రంలోనే టాప్ 5 స్థాయిలో నిలిచారు , ఆర్థికంగా బలంగా ఉన్న నేతగా కేంద్రస్థాయి రాష్ట్రస్థాయి నాయకులతో మంచి సత్సం బంధాలు కలిగి కష్టపడే తత్వం కలిసొస్తుందని జగిత్యాల జిల్లా లో యువతను బిజెపి వైపు ఆకర్షించడంలో సురభి నవీన్ ఎనలేని గుర్తింపు పొందారు బిజెపి జిల్లా అధ్యక్షునిగా సురభి నవీన్ కుమార్ నియమిస్తే జిల్లాలో బిజెపి పార్టీకి పూర్వ వైభవం ఉంటుందని బిజెపి కార్యకర్తలు బీజేవైఎం, నాయకులు జోరుగా చర్చించుకుంటున్నారు బీజేపీ జగిత్యాల అసెంబ్లీ నుండి 2023 మొదటి సారి పోటీ చేసిన భోగ శ్రావణి కూడా బీసీ సామాజిక వర్గం మహిళ కోట అనే అంశాలు కలసి వచ్చి జిల్లా అధ్యక్ష పదవి తనకే వారిస్తుందని వారి అభిమానులు కోరుకుంటున్నారు బీజేపీ పార్టీ జగిత్యాల జిల్లా అధ్యక్షులు గా రెండు సార్లు చేసిన అనుభవంతో పైడిపెల్లి సత్యనారాయణ మూడో సారి కూడ జిల్లా అధ్యక్ష పదవి వస్తుంది అని సీనియర్ నాయకులుగా ఎబివిపి నుండి వచ్చేనా నేతగా పైడిపెల్లి సత్యనారాయణ కు మంచి గుర్తింపు వుంది బిజెపి పార్టీలో సీనియర్ నాయకునిగా ముదిగంటి రవీందర్ రెడ్డి కి మంచి గుర్తింపు ఉంది 2014 2018 అసెంబ్లీ ఎన్నికలు పోటీ చేసి ఓడిపోయిన నిత్యం కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ ఆశించి టికెట్ రాకపోవడం తో పార్టీ నిర్ణయనికి కట్టుబడి వుంటూ క్రమశిక్షణ కలిగిన నేతగా సంఘ పరివార్ నేపథ్యం కలిగిన నాయకుడు ముదిగంటి రవీందర్ రెడ్డి అధ్యక్ష పదవి తమ నాయకుడిగా వరిస్తుందని ఆయన సన్నిహిత వర్గాలు చర్చించుకుంటున్నాయి

## ఆదివాసీలపై వరాల జల్లు...

- అధికారికంగా కొమురం భీం జయంతి
- ఆదివాసీలపై పెట్టిన ఉద్యమ కేసులు ఎత్తివేస్తాం
- ఆదివాసీ విద్యార్థులకు వంద శాతం ఓవర్‌షిప్ స్కాలర్‌షిప్‌లు
- ప్రతి నాలుగు నెలలకోసారి నాయకులతో సమావేశం
- ఆదివాసీ సంఘాలు, నాయకులతో సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- గోండి భాషలో బోధనపై సమగ్ర నివేదికకు ఆదేశం
- సాగుకు ఉచితంగా సోలార్ పంపు సెట్లు

2లో

మన వెలుగు
MANA VELUGU TELUGU DAILY



# ఆది ఆదివాసీలపై వరాల జల్లు...




**హైదరాబాద్ (మన వెలుగు) జనవరి 10 :** ఆదివాసీలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరాల జల్లు కురిపించారు. ఆదివాసీ యోధుడు కొమురం భీం జయంతి.. వర్ధంతిని అధికారికంగా (స్టేట్ ఫంక్షన్‌గా) నిర్వహిస్తామని ప్రకటించారు. ఇందుకు సంబంధించి వెంటనే ఉత్తర్వుల జారీ చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆదివాసీ సంఘాలు, నాయకులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సచివాలయంలో శుక్రవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. తమ ప్రాంతాల్లో రవాణా, సాగు, తాగునీటి సరఫరా, తమపై నమోదైన, నమోదవుతున్న కేసులు, విద్యా, ఉద్యోగ, ఆర్థిక సమస్యలను ఆదివాసీ నాయకులు ముఖ్యమంత్రికి సోదాహరణంగా వివరించారు. ప్రతి సమస్యను సావధానంగా విన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారు లేవనెత్తిన పలు సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపారు. మరికొన్నింటి పరిష్కారానికి సమగ్ర అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఇది తొలి సమావేశం మాత్రమేనని, ప్రతి నాలుగు నెలలకు ఒకసారి సమావేశమవుదామని ఆదివాసీ నాయకులకు సీఎం తెలిపారు. ఏడాదికి మూడు సార్లు జరిగే సమావేశాల్లో గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు, రాబోయే కాలంలో పరిష్కరించుకోవాల్సిన అంశాలపై చర్చిస్తామని ఆదివాసీ నాయకులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభయమిచ్చారు. సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని... ఎట్టి పరిస్థితుల్లోనూ ఆందోళనలకు దిగవద్దని సీఎం సూచించారు. ఆందోళనల ఫలితంగా యువకులపై కేసులు నమోదయితే భవిష్యత్‌లో అవి వారి ఉద్యోగ అవకాశాలకు గండిపెడతాయని సీఎం తెలిపారు. ఆదివాసీలపై ఉద్యమాల సమయంలో పెట్టిన కేసులు ఎత్తివేస్తామని.. ఈవిషయంలో అవసరమైతే శాసనసభలో చర్చపెట్టి తీర్మానం చేస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు. తాను పీసీసీ అధ్యక్షునిగా అయిన తర్వాత తొలి సమావేశం ఇంద్రవెల్లిలోనే పెట్టానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివాసీ నాయకులకు గుర్తు చేశారు. నాటి సమావేశంలో తన దృష్టికి వచ్చిన ఇంద్రవెల్లి అమరుల స్మృతివనం ఏర్పాటు, అమరుల కుటుంబాలకు ఇళ్ల మంజూరు వంటి వాటిని అధికారంలోకి వచ్చిన వెంటనే పూర్తి చేశామని సీఎం తెలిపారు. రాజకీయాలపరంగా ఆదివాసీలకు అన్యాయం చోటుచేసుకుండా చూస్తున్నామని, సీతక్కను ఆదిలాబాద్ జిల్లాకు ఇన్‌ఛార్జిగా మంత్రిగా పెట్టామని ముఖ్యమంత్రి అన్నారు.

ఆదివాసీ విద్యార్థులకు ప్రత్యేక స్టడీ సర్కిల్... ఆదివాసీ విద్యార్థుల విద్యా, ఉద్యోగ, ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇందులో భాగంగా ఆదివాసీ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. స్టడీ సర్కిల్‌కు అవసరమైన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న ఆదివాసీ విద్యార్థులందరికీ ఓవర్‌షిప్ స్కాలర్‌షిప్‌లు మంజూరు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఆ దరఖాస్తుల వివరాలను వెంటనే మంత్రి సీతక్కకు అందజేయాలని సీఎం ఆదివాసీ నాయకులకు సూచించారు. విద్యార్థులకు గోండీ భాషలో ప్రాథమిక విద్యను బోధించడానికి అవసరమైన ప్రణాళికపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉట్నూరు, భద్రాచలంలోని ట్రైబల్ బీఈడీ కళాశాలల్లో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి అవసరమైన చర్యలు తక్షణమే తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆదివాసీ విద్యార్థులకు స్కిల్ యూనివర్సిటీలో ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామని, వారికి వసతి కల్పిస్తామని సీఎం తెలిపారు. ఏజెన్సీలోని ఐటీఐలను ఏటీసీలుగా మార్చుతున్నామని, వాటిలో ఆదివాసీ విద్యార్థులు చేరేలా ఆదివాసీ పెద్దలు, విద్యావంతులు ప్రోత్సహించాలని సీఎం సూచించారు.

**ఆర్థికాభివృద్ధిపై దృష్టి పెడతాం....** ఆదివాసీల ఆర్థికాభివృద్ధికి అండగా నిలుస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేల కోటా కింద ఇచ్చే ఇళ్లతో సంబంధం లేకుండా ఆదివాసులకు సీఎం కోటా కింద ప్రత్యేకంగా ఇళ్లు మంజూరు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. జనాభా ప్రాతిపదికన ఈ ఇళ్లు ఇచ్చేలా చూడాలని అధికారులను సీఎం ఆదేశించారు. నాన్ ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీలకు ఇళ్లు కేటాయిస్తామని సీఎం తెలిపారు. ఆదివాసీ రైతులకు ఉచితంగా సోలార్ మోటార్లు (వంద శాతం రాయితీ) అందిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. ఇందిర జలప్రభ కింద ఉచితంగా బోర్లు వేసే అంశంపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని సీఎం అధికారులకు సూచించారు. ఉచితంగా సోలార్ పంపుసెట్లతో పాటు ఇళ్లకు సోలార్ ద్వారా విద్యుత్ అందించేందుకు ప్రయత్నిస్తామని సీఎం చెప్పారు. ఆదివాసీ గూడేల్లో తాగు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని... ఇందుకోసం ఐటీడీఏల పరిధిలో వెంటనే స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

**కేస్లాపూర్ జాతరకు నిధులు...**

కేస్లాపూర్ జాతరకు నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివాసీలకు ఎంతో కీలకమైన రాయి సెంటర్లకు భవనాల నిర్మాణం చేపడతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రాయి సెంటర్ల నిర్మాణం, అందుకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాలు, ఎన్ని భవనాలు అవసరమనే దానిపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఆయా భవనాలు ఎలా ఉండాలనే దానిపై పంచాయతీరాజ్ శాఖ నుంచి నమూనాలు తయారు చేయించాలని మంత్రి సీతక్కకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. సమావేశంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, మాజీ ఎంపీ సోయం బాపురావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ప్రొఫెసర్ గుమ్మడి అనురాధ, ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# శంభూ సరిహద్దులో మరో రైతు ఆతహత్య

న్యూఢిల్లీ : పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)కు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ రైతునేత దల్లేవాల్ నలబై రోజులుగా నిరవధిక దీక్ష చేస్తున్నా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పట్టించుకోక పోవడానికి నిరసనగా మరో అన్నదాత ప్రాణ త్యాగం చేశాడు. శంభు సరిహద్దుల్లో ఆందోళన చేస్తున్న తరణ్ తరణ్ జిల్లాకు చెందిన 55 ఏళ్ల రైతు గురువారం విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మూడువారాల వ్యవధిలో ఇద్దరు రైతులు బలవన్మరణానికి పాల్పడ్డారు. గురువారం ఉదయం 9 గంటలకు ఆల్పాహార సమయంలో రైతు ఆత్మాహత్యాయత్నం చేయగా, ఆయనను వెంటనే సమీపంలోని రాజ్‌పురా సివిల్ ఆసుపత్రికి, అక్కడ నుంచి పాటియాలోని ప్రభుత్వ రాజేంద్ర ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. ఈ సంఘటన గురించి రైతు నాయకులు మాట్లాడుతూ, రైతు సమస్యలపై కేంద్రం స్పందించకపోవడానికి వ్యతిరేకంగానే ఆత్మహత్య చేసుకున్నారు' అని తెలిపారు. శంభు వద్ద, అలాగే ఖనౌరీ వద్ద గత ఏడాది ఫిబ్రవరి 13 నుంచి రైతులు ఆందోళన చేస్తు న్నారు. డిసెంబరు 18న లూథియానాకు చెందిన మరొక రైతు కూడా ఆత్మహత్య చేసుకున్నారు.

# కమ్మేసిన పొగమంచు 100కుపైగా విమానాలు ఆలస్యం

**న్యూఢిల్లీ :** ఉత్తరభారతాన్ని పొగమంచు కమ్మేసింది. దట్టమైన పొగమంచు కప్పుకుపోవడంతో 100కు పైగా విమానాలు ఆలస్యమయ్యాయి. ఢిల్లీతో సహా యుపి, పంజాబ్, జార్ఖండ్, పశ్చిమబెంగాల్ సహా పలు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు తీవ్రంగా పడిపోవడంతో చలి తీవ్రత పెరిగింది. ఢిల్లీ-ఎన్సీఆర్ ప్రాంతాన్ని దట్టంగా పొగ కమ్మేయడంతో విజిబిలిటీ దారుణంగా పడిపోయింది. ఈ కారణంగా ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించని పరిస్థితి ఏర్పడింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం ఉదయం ఢిల్లీ ఇందిరా గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో విజిబిలిటీ జీరోకు పడిపోయినట్లు అధికారులు వెల్లడించారు. పొగమంచు కారణంగా ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో వందకుపైగా విమానాలు ఆలస్యమయ్యాయి. కొన్ని విమానాలు రద్దయ్యాయి. ఇక కోల్‌కతా విమానాశ్రయానికి రాకపోకలు సాగించే 12 విమానాలు ఆలస్యంగా నడుస్తున్నట్లు ఎయిర్ ట్రాఫిక్ మానిటరింగ్ ప్లాట్‌ఫామ్ ఫ్లైట్‌రాడార్ ప్రకటించింది.

# కనుచూపు మేరలో కానరాని పరిష్కారం....!



**గాజా :** ఇజ్రాయిల్ యుద్ధోన్మాదంతో సాగిస్తున్న అమానవీయ దాడులకు ఇప్పట్లో తెర పడేలా లేదు. గాజాలో కొనసాగిస్తున్న ఈ దాడులకు ఇప్పటికే 15 మాసాలు ముగిసింది. 16వ నెల్లోకి అడుగు పెట్టినా ఇంకా ఎక్కడా ఈ దాడులకు ముగింపు అనేది కనిపించడం లేదు. ఈ దాడుల్లో ఇప్పటివరకు 46,006 మంది పాలస్తీనియన్లు మరణించారని గాజా ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి. గాయపడిన వారి సంఖ్య 1,09,378కి చేరింది. మృతి చెందిన వారిలో సగానికి పైగా మహిళలు, పిల్లలే వున్నారు. కాగా హమాస్ వద్ద ఇంకా వంద మంది వరకు బందీలు వున్నట్లు తెలుస్తోంది. సుదీర్ఘకాలంగా విచక్షణారహితంగా కొనసాగుతున్న దాడుల్లో గాజాలో మెజారిటీ ప్రాంతాలు భూస్థాపితమయ్యాయి. 23 లక్షల మంది ప్రజల్లో దాదాపు 90 శాతం మంది నిర్వాసితులయ్యారు. వీరిలో చాలామంది పదే పదే దాడులకు గురవుతూ పలు ప్రాంతాలకు వలసలు వెళ్ళాల్సి వస్తోంది. వందలు వేల సంఖ్యలో ప్రజలు తాత్కాలిక శిబిరాల్లో తల దాచుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పైగా ఆహారం, ఇతర నిత్యావసరాలు కూడా వారికి సరిగా అందని పరిస్థితి నెలకొంది. ఇదిలావుండగా కాల్పుల విరమణకు, బంధీల విడుదలకు జరుగుతున్న ప్రయత్నాలు ఒక కొలిక్కి రానున్నట్లు కనిపిస్తోంది. అమెరికా, కతార్, ఈజిప్ట్‌ల మధ్యవర్తిత్వంతో జరుగుతున్న చర్చలు గత ఏడాది కాలంలో అనేక కారణాలతో పదే పదే స్తంభిస్తూ వచ్చాయి. గత 24 గంటల్లో గాజాలో 70 మంది పాలస్తీనియన్లు మరణించగా, 104 మంది గాయపడ్డారు. ఈ యుద్ధాన్ని ఇక ముగించాలంటూ 800 మంది పైగా ఇజ్రాయిలీ సైనికుల తల్లిదండ్రులు ప్రధాని నెతన్యాహును డిమాండ్ చేశారు. గాజా తమ పిల్లల సమాధిగా మారకూడదని తాము కోరుకుంటున్నట్లు చెప్పారు. కాగా అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ కాల్పుల విరమణ, బందీల విడుదల పట్ల ఆశాభావం వ్యక్తం చేశారు. హమాస్ చెరలో వున్న బందీ యూసుఫ్ జియాద్నె మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఇజ్రాయిల్ మిలటరీ తెలిపింది. 15 మాసాలుగా కొనసాగుతున్న దాడుల తర్వాత పరిస్థితులు అత్యంత భయంకరంగా వున్నాయని గాజా డాక్టర్లు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గాయపడిన వారికి చికిత్సనందించడం దుర్లభమవుతోందని అన్నారు.

# విదేశాల్లో సమాంతర ప్రభుత్వ ఏర్పాటుకు కుట్ర



**కారకస్ :** దేశ రాజ్యాంగాన్ని పట్టించుకోకుండా దేశానికి వెలుపల సమాంతర అధ్యక్ష అధికారాలను ఏర్పాటు చేసేందుకు కుట్ర పన్నారంటూ వెనిజులా పౌరుల భద్రతా వ్యవహారాల మంత్రి కాబెల్లొ చెప్పారు. అధ్యక్ష ఎన్నికల్లో ఓటమి పాలైన ప్రతిపక్ష అభ్యర్థిని అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేయించేందుకు మితవాదులు పన్నిన కుట్ర వివరాలను ఆయన బుధవారం వెల్లడించారు. ఓడిపోయిన అధ్యక్ష అభ్యర్థి ఎడ్ముండో గొంజాలెజ్ ప్రమాణ స్వీకారంపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించారని కాబెల్లొ చెప్పారు. దీనిపై 21పేజీల డాక్యుమెంట్‌ను అందచేశారు. విదేశాల్లో తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలన్నది వారి లక్ష్యంగా వుందన్నారు. దేశ రాజ్యాంగంలోని 231వ అధికరణ కింద దీన్ని రాజ్యాంగ విరుద్ధమైన చర్యగా కాబెల్లొ నిరసించారు. అధ్యక్షుని ప్రమాణ స్వీకారాలు పార్లమెంట్ వెలుపల, మన దేశ భూభాగంపై జరగాలన్నారు. కానీ వారు రాజ్యాంగాన్ని పక్క దోవ పట్టించాలని చూస్తున్నారని అన్నారు. మాజీ అధ్యక్ష అభ్యర్థి ఎన్‌రిక్ మార్క్వెజ్ కంప్యూటర్‌లో ఈ డాక్యుమెంట్‌ను కనుగొన్నారు. ప్రతిపక్ష నేతలను ఉద్దేశించి ఈ డాక్యుమెంట్ రూపొందించారు. ఇటీవల ఎఫ్‌బిఐ ఏజెంట్‌ను అరెస్టు చేయడానికి ఈ పరిణామాలకు సంబంధం వుందని కాబెల్లొ పేర్కొన్నారు. వెనిజులాలో రెండు దశాబ్దాలకు పైగా కార్యకలాపాలతో ఆ ఏజెంట్‌కు సంబంధం వుందన్నారు. ఈ ఏజెంట్‌ను అరెస్టు చేయడంతో పాటూ ఇద్దరు కొలంబియా కిరాయి వ్యక్తులను నిర్బంధించారు.


# పాకిస్తాన్‌లో 16 మంది నిర్మాణ కార్మికుల కిడ్నాప్

**పెషావర్ :** పాకిస్తాన్‌లోని రెస్టివ్ ఖైబర్ ఫక్తూన్‌ఖవా ప్రావిన్స్‌లో గుర్తు తెలియని సాయుధాలు 16 మంది నిర్మాణ రంగ కార్మికులను కిడ్నాప్ చేశారు. స్థానిక పోలీసుల కథనం ప్రకారం.. ప్రభుత్వ నిర్మాణ ప్రాజెక్టులో పనిచేస్తున్న వీరంతా నిర్మాణ ప్రాంతానికి వాహనంలో వెళుతుండగా అపహరించారు. ఆ వాహనానికి నిప్పంటించారు. ఈ ప్రాంతంలో నిషేధిత తెహ్రీక్ ఇ తాలిబన్ పాకిస్తాన్ (టిటిపి) పనిచేస్తోంది, పైగా గతంలో ఇలాంటి అపహరణలకు పాల్పడిన సమాచారం వుంది. అల్‌ఖైదాకు సన్నిహితంగా పని చేస్తున్న ఈ సంస్థ అనేక రకాలుగా దాడులు సాగిస్తోంది. మరో సంఘటనలో ట్యాంక్ జిల్లాలో 25కిలోల బాంబును అధికారులు నిర్వీర్యం చేశారు. వాయవ్య పాకిస్తాన్‌లోని మారుమూల జిల్లాలో డజన్ల సంఖ్యలో సాయుధ బలూచ్ వేర్పాటువాదులు అరాచకం సృష్టించారు. ప్రభుత్వ కార్యాలయాన్ని స్వాధీనం చేసుకున్నారు. బ్యాంక్ దోపిడీకి పాల్పడ్డారు. ఒక పోలీసు స్టేషన్‌ను పాక్షికంగా దగ్ధం చేశారని పోలీసులు గురువారం తెలిపారు. భద్రతా బలగాలు వచ్చేలోపు వారక్కడ నుండి పారిపోయారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే వుందని చెప్పారు. కాగా బలూచిస్తాన్‌లోని ఖుజ్దార్‌లో బుధవారం జరిగిన దాడికి తమదే బాధ్యత అని నిషేదిత బలూచ్ లిబరేషన్ ఆర్మీ ప్రకటించింది. ఇటీవలి కాలంలో వాయవ్య ఖైబర్‌ఫక్తునువా ప్రావిన్‌ఐస, బలూచిస్తాన్‌ల్లో తీవ్రవాదుల హింస పెరిగింది. బలూచ్ ఆర్మీ, పాకిస్తాన్ తాలిబన్ ఇందుకు కారణమని భావిస్తున్నారు. ఆఫ్ఘన్ తాలిబన్ 2021లో పొరుగున వున్న ఆఫ్ఘనిస్తాన్‌ను స్వాధీనం చేసుకోవడంతో పాక్ తాలిబన్‌కు ధైర్యం వచ్చింది. దాంతో వారు ఈ మధ్య ఎక్కువగా దాడులకు దిగుతున్నారు.

# కెనడా ప్రధాని రేసులో ఎంపీ చంద్ర ఆర్య

**కెనడా** ప్రధానమంత్రి పదవి రేసులోకి మరో భారత సంతతి నేత వచ్చారు. ఆయన మరెవరో కాదు..ఎంపీ చంద్ర ఆర్య.నేపియన్ ప్రాంతం నుంచి కెనడా పార్లమెంటుకు చంద్ర ఆర్య ప్రాతినిధ్యం వహిస్తున్నారు. జస్టిన్ ట్రూడో రాజీనామాతో ఖాళీ అయిన కెనడా ప్రధానమంత్రి పదవికి జరుగుతున్న పోటీలో తాను కూడా ఉన్నానని ఆయన వెల్లడించారు.ఈమేరకు ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. "మునుపెన్నడూ లేని విధంగా పలు నిర్మాణాత్మక సమస్యలను కెనడా ఎదుర్కొంటోంది. వాటిని పరిష్కరించాలంటే మనం కొన్ని కఠిన నిర్ణయాలను తీసుకోక తప్పదు. దేశ భావితరాల కోసం సాహసోపేత నిర్ణయాలను తీసుకోవాలి. పెద్దపెద్ద నిర్ణయాలను తీసుకోవడంలో భయపడని బలమైన నాయకత్వం కెనడాకు కావాలి. దేశ ప్రయోజనాల కోసం సాహసోపేత నిర్ణయాలు తీసుకోవడం అనేది ఐచ్ఛికం కాదు, తప్పనిసరి. అలాంటి నిర్ణయాలే కెనడా పునర్నిర్మాణానికి దోహదం చేస్తాయి. భావితరాల భవితను సురక్షితంగా మారుస్తాయి. కెనడా ప్రధానిగా అవకాశమిస్తే నేను ఆ దిశగా నిర్ణయాలు తీసుకునే చొరవను చూపిస్తా" అని ఎంపీ చంద్ర ఆర్య ప్రకటించారు. ప్రపంచ హిందీ దినోత్సవాన్ని ఎందుకు జరుపుకుంటారు..? "నన్ను అధికార లిబరల్ పార్టీ పార్లమెంటరీ నేతగా ఎన్నుకుంటే కెనడా ప్రయోజనాలే పరమావధిగా పనిచేస్తాను. కెనడా ఆర్థిక వ్యవస్థను మళ్లీ పట్టాలు ఎక్కిస్తా" అని చంద్ర ఆర్య తెలిపారు. కెనడా ఆర్థిక వికాసంలో అందరు కెనడియన్లను భాగస్తులుగా చేస్తానన్నారు. దేశంలో పేదలు, యువత వికాసం కోసం పక్కా ప్రణాళికతో పాలన సాగిస్తానని చెప్పారు. గత సోమవారం రోజు కెనడా ప్రధాని పదవికి జస్టిన్ ట్రూడో రాజీనామా చేశారు. దీంతో ఆ పదవిని భర్తీ చేయడంపై అధికార లిబరల్ పార్టీ ఫోకస్ పెట్టింది.

# అధికమౌతున్న ఆదాయ అసమానతలు



**న్యూఢిల్లీ :** దేశంలో ఆదాయ అసమానతలు 1950వ దశకంలో కంటే అధికంగా ఉన్నాయని ఓ కార్యాచరణ పత్రం తెలిపింది. పీపుల్ రిసెర్చ్ ఆన్ ఇండియాస్ కన్స్యూమర్ ఎకానమీ (ప్రైస్) అనే సంస్థ రూపొందించిన ఈ పత్రాన్ని ఇటీవలే విడుదల చేశారు. సమ్మిళిత వృద్ధి, సామాజిక-ఆర్థిక సమానత్వం కోసం సమర్థవంతమైన విధానాలను రూపొందించడానికి ఆదాయ పంపిణీని కచ్చితత్వంతో లెక్కించాల్సిన అవసరాన్ని ఈ పత్రం గుర్తు చేసింది. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లయిడ్ ఎకనమిక్ రిసెర్చ్, ప్రైస్ వంటి సంస్థలు నిర్వహించిన కుటుంబ ఆదాయ సర్వేల ఆధారంగా ఈ పత్రాన్ని రూపొందించారు. వ్యక్తులు, కుటుంబాల మధ్య ఆదాయ అసమానతలను నిర్ధారించడానికి ఉపయోగించిన గణాంక పద్ధతి 'గినీ కోఎఫీషియంట్' ప్రకారం అసమానతల సూచీ 1953-55 మధ్య 0.371గా ఉంటే 2022-23లో 0.410గా ఉంది. సమాజంలోని సంపన్నులు జాతీయాదాయంలో తమ వాటాను గణనీయంగా పెంచుకుంటుంటే గ్రామీణ, అల్పాదాయ వర్గాల ప్రజలు అత్యవసర సేవలు, విద్య, ఆరోగ్య రక్షణ, ఆర్థికావసరాలు పరిమితంగానే పొందగలుగుతున్నారని ఆ పత్రం తెలిపింది. 2015-16, 2020-21 మధ్యకాలంలో దేశంలో ఆదాయ అసమానతలకు సంబంధించిన గినీ సూచిక 0.395 నుండి 0.528కి పెరిగిందని ప్రైస్ సంస్థ సీఈఓ, కార్యాచరణ పత్రం రూపకర్త రాజేష్ శుక్లా తెలిపారు. వరల్డ్ ఇన్ఈక్వాలిటీ డాటాబేస్ (విడ్) ప్రకారం 2023లో దేశంలో అత్యంత సంపన్నులైన ఒక శాతం ప్రజలు 22.6 శాతం జాతీయాదాయంపై ఆధిపత్యాన్ని చెలాయించారు. కానీ భారతీయ కుటుంబ సర్వేలు మాత్రం సంపన్నుల వాటా జాతీయాదాయంలో 7.3 శాతమేనని చెబుతున్నాయి.

# సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ప్రభుత్వోద్యోగులు కారు



**న్యూఢిల్లీ :** హైకోర్టులు, సబార్డినేట్ కోర్టుల జడ్జీలు తమ పరిధిలోకే వస్తారని, అయితే సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ప్రభుత్వోద్యోగులు కానందున వారికి మినహాయింపు ఉన్నదని లోక్‌పాల్ రూలింగ్ ఇచ్చింది. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌కు వ్యతిరేకంగా దాఖలైన ఫిర్యాదును తోసిపుచ్చుతూ లోక్‌పాల్ ఈ కీలక ఆదేశాలు జారీ చేసింది. జస్టిస్ చంద్రచూడ్ ఒక రాజకీయవేత్తకు, ఒక రాజకీయ పార్టీకి అనుకూలంగా వ్యవహరించడం కోసం అవినీతికి పాల్పడ్డారని, తన అధికారాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపిస్తూ గత అక్టోబర్ 18న లోక్‌పాల్‌కు 382 పేజీల ఫిర్యాదు అందింది. అయితే దీనిని లోక్‌పాల్ తోసిపుచ్చింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు తన పరిధిలోకి రారని తెలిపింది. సుప్రీంకోర్టు పార్లమెంట్ చట్టం ద్వారా ఏర్పడినది కాదని, అది రాజ్యాంగంలోని 124వ అధికరణ కింద ఏర్పడిందని, కాబట్టి దాని న్యాయమూర్తులు ప్రభుత్వోద్యోగుల నిర్వచనం కిందికి రారని లోక్‌పాల్ రూలింగ్ ఇచ్చింది. పైగా సుప్రీంకోర్టుకు పూర్తిగా కానీ, పాక్షికంగా కానీ కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందించడం లేదని, అంతేకాక దానిని నియంత్రించడం లేదని జస్టిస్ ఏఎం ఖన్విల్కర్ అధ్యక్షత వహిస్తున్న లోక్‌పాల్ తెలియజేసింది. సుప్రీంకోర్టు వ్యయాన్ని కన్సాలిడేటెడ్ ఫండ్ నుండి భరిస్తారని, అత్యున్నత న్యాయస్థానం కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులపై ఆధారపడదని తెలిపింది. అయితే తన పరిధిలోని హైకోర్టులు, ఇతర న్యాయస్థానాల జడ్జిలకు ఈ రూలింగ్ వర్తించదని లోక్‌పాల్ స్పష్టం చేసింది. అవి పార్లమెంట్ చట్టం ద్వారా ఏర్పడినవి కాబట్టి తన పరిధిలో ఉంటాయని తెలిపింది. ఫిర్యాదుదారుడు చట్టం అనుమతించిన పద్ధతుల్లో ఇతర పరిష్కార మార్గాలు అన్వేషించుకోవచ్చునని, ఫిర్యాదులోని ఆరోపణలపై తాము స్పందించబోమని లోక్‌పాల్ తెలియజేసింది.

# పంజాబ్‌లో భారీ కిసాన్ మహా పంచాయత్

న్యూఢిల్లీ : రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) చట్టబద్ధమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ, జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధాన ముసాయిదాను వ్యతిరేకిస్తూ రైతులు ఆందోళన రోజు రోజుకు ఉధృతం అవుతోంది. గురువారం సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) పంజాబ్‌లోని మోగాలో భారీ కిసాన్ మహా పంచాయతీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల, రైతుల వ్యతిరేక విధానాలపై ఐక్యంగా పోరాటం చేయాలని కిసాన్ మహా పంచాయతీ పిలుపు ఇచ్చింది. అలాగే ఎస్‌కెఎంకి చెందిన ఆరుగురు సభ్యుల



ప్రతినిధి బృందం ఈ నెల 10న శుక్రవారం శంభు, ఖన్నౌరి రైతుల ఆందోళన కేంద్రాలను సందర్శించాలని మహాపంచాయతీ తీర్మానం చేసింది. శంభు, ఖన్నౌరి సరిహద్దుల్లో రైతుల ఆందోళనకు నాయకత్వం వహిస్తున్న రైతు సంఘాల ప్రతినిధులను 15న పాటియాలాలో జరిగే సంయుక్త సమావేశానికి ఆహ్వానించనున్నారు. నవంబర్ 26 నుండి ఖన్నౌరిలో నిరాహార దీక్ష చేస్తున్న రైతు నాయకుడు జగ్జిత్ సింగ్ దల్లేవాల్ ప్రాణాలకు ముప్పు ఉంటే కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని మహాపంచాయతీ ప్రకటించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, హెూంమంత్రి అమిత్ షా, వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మొండి వైఖరి కారణంగా దల్లేవాల్ ఆరోగ్య పరిస్థితి మరింత దిగజారింది. కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాల కోసం కేంద్రం తీసుకొచ్చిన వ్యవసాయ మార్కెటింగ్ విధానం ప్రతులను 13న అన్ని గ్రామాల్లో దగ్ధం చేయనున్నారు. దుర్మార్గమైన ఈ మార్కెటింగ్ విధానాలను వ్యతిరేకిస్తూ రాష్ట్ర అసెంబ్లీల్లో తీర్మానాలు చేయాలని విజ్ఞప్తి చేసింది. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు ఇందులో ముందడుగు వేయాలని, ఈ విషయంలో పంజాబ్ ముఖ్యమంత్రి ప్రకటనను మహాపంచాయతీ స్వాగతించింది. పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అసెంబ్లీ సమావేశాన్ని ఏర్పాటు చేసి, దానిని తిరస్కరిస్తూ తీర్మానాన్ని ఆమోదించాలని కూడా డిమాండ్ చేసింది. వేలాది మంది హాజరైన మహా పంచాయతీలో ఎస్‌కెఎం బల్బీర్ సింగ్ రాజేవాల్, జోగిందర్ సింగ్ ఉగ్రహన్, రాకేష్ టికాయత్, పి. కృష్ణ ప్రసాద్, దర్శన్‌పాల్, హర్మీత్ సింగ్ తదితరులు మాట్లాడారు. ఎస్‌కెఎం తన భవిష్యత్తు కార్యచరణను ఈ నెల 24, 25 తేదీలలో ఢిల్లీలో జరిగే జాతీయ కౌన్సిల్ సమావేశంలో ప్రకటిస్తుంది.

# మేధో వైకల్యం ఉంటే మాతృత్వం పొందకూడదా....?



**ముంబయి :** 21 వారాల గర్భిణిగా ఉన్న యువతికి మేధో వైకల్యం ఉన్నదని తేలితే ఆమెకు మాతృత్వం పొందే హక్కు లేదని ఎలా చెబుతారని బాంబే హైకోర్టు ప్రశ్నించింది. ఆ యువతికి మేధో వైకల్యం ఉన్నప్పటికీ మతిస్థిమితం లేని వ్యక్తి కాదని హైకోర్టు నియమించిన మెడికల్ బోర్డ్ నిర్ధారించింది. దీనిపై జస్టిస్ ఆర్వీ ఘుగే, జస్టిస్ రాజేష్ పాటిల్‌తో కూడిన డివిజన్ బెంచ్ స్పందిస్తూ 27 సంవత్సరాల యువతికి మేధో వైకల్యం ఉన్నదని, అయితే ఆమె ఇంటెలిజెన్స్ కోషెంట్ (తెలివితేటలను తెలిపే సాధనం- ఐక్యూ) 75గా ఉన్నదని, పైగా ఆమె గర్భాశయంలో అసాధారణతలు లేదా క్రియాత్మక మార్పులు ఏవీ లేవని తెలిపింది. 'ఎవరూ అత్యంత మేధావులు, తెలివితేటలు కలిగిన వారు కారు. మనమంతా మానవులం. ప్రతి వారిలోనూ భిన్నమైన తెలివితేటలు ఉంటాయి' అని కోర్టు వ్యాఖ్యానించింది. తెలివితేటలు సగటు స్థాయి కంటే తక్కువగా ఉన్నంత మాత్రాన ఆమెకు తల్లి అయ్యే హక్కు లేదని చెప్పడం సరికాదని స్పష్టం చేసింది. సగటు కంటే తక్కువ స్థాయిలో తెలివితేటలు కలిగిన వారికి తల్లిదండ్రులయ్యే హక్కు లేదని అంటే అది చట్ట విరుద్ధమేనని చెప్పింది. మహిళ మానసిక స్థితి సరిగా లేదని, ఆమె అవివాహితురాలని, కాబట్టి గర్భవిచ్ఛిత్తికి అనుమతించాలని కోరుతూ మహిళ తండ్రి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే గర్భవిచ్ఛిత్తికి అంగీకరించడానికి ఆ మహిళ నిరాకరించింది. గర్భాన్ని కొనసాగించాలని కోరుకుంది. దీనిపై జనవరి 3న స్పందించిన న్యాయస్థానం మహిళ గర్భంలోని పిండాన్ని పరీక్షించి, నివేదిక అందజేయాలని జేజే ఆస్పత్రి మెడికల బోర్డును ఆదేశించింది. మహిళ తన గర్భాన్ని కొనసాగించవచ్చునని, అదే సమయంలో గర్భవిచ్ఛిత్తి కూడా సాధ్యమేనని మెడికల్ బోర్డు నివేదించింది. మహిళ ఓ పురుషుడితో వివాహేతర సంబంధాన్ని కొనసాగించిందని, అయితే వారిద్దరూ మేజర్లే అయినందున అది నేరం కాదని కోర్టు అభిప్రాయపడింది. మహిళతో సంబంధాన్ని కొనసాగించిన వ్యక్తిని సంప్రదించి వివాహం చేసుకునేలా ఒప్పించడానికి ప్రయత్నించాలని తల్లిదండ్రులకు సూచించింది. బిడ్డ ప్రయోజనాలు కాపాడాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనని న్యాయస్థానం తెలిపింది.

# బాస్వారము కరగదీయు బ్యాక్టీరియా జీవన ఎరువు పంపిణీ




**మద్దూరు (మన వెలుగు) జనవరి 10** :మండల వ్యవసాయ కార్యాలయం నందు బాస్వారము కరగదీయు బ్యాక్టీరియా (పిఎస్బి) అనే జీవన ఎరువు పంపిణీ చేయడం జరిగింది. ఒక్కో కిలో ప్యాకెట్ 50 రూపాయలు కాగా సబ్సిడీ కింద 30రూపాయలు ఫోను 20 రూపాయలకు ఒక కిలో ప్యాకెట్టు ఇవ్వడం జరిగింది. ఒక్క ఎకరాకు2-3 కిలోల కల్చర్ పొడిని 100 కిలోల బాగా మగ్గిన పశువుల ఎరువులు కలిపి చల్లుకోవాలి దీనిని వాడటం వలన బాస్వరం ఎరువులు పంటలకు వేసినప్పుడు వీటిలోని బాస్వారము ఒక చోట నుండి కదలకుండా భూమిలో దాదాపు 60 శాతం మొక్కలు గ్రహించుటకు వీలు లేకుండా బంధింపబడి ఉంటుంది బాస్వరము కరగదీయు బ్యాక్టీరియా(పిఎస్బి) వేసినప్పుడు దీనియందలి బ్యాక్టీరియా కరగదీసి మొక్కలకు అందిస్తుంది. కావలసిన రైతులు పాస్ బుక్ మరియు ఆధార్ కార్డు తీసుకుని వచ్చి పొందగలరు. ఇట్టి కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బీములు. (పిఏసీఎస్) నర్సిములు. మాజీ జెడ్పిటిసి రఘుపతి రెడ్డి నాయకులు బసవరాజ్ వ్యవసాయ విస్తీర్ణ అధికారులు శ్రవణ్ కుమార్. శ్వేత పాల్గొన్నారు

# కళ్యాణ లక్ష్మి, షాదీ ముభారక్ చెక్కుల పంపిణీ



**నిర్మల్ ప్రతినిధి (మన వెలుగు) జనవరి 10 :** తానూర్ మండల కేంద్రంలోని మండల రైతు వేదిక నందు మండల ఆయా గ్రామాల కళ్యాణ లక్ష్మి, షాదీ ముభారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొనీ 32 చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేసిన స్థానిక శాసన సభ్యులు పవార్ రామారావు పటేల్. అనంతరం మండలా నికి చెందిన ఆయా గ్రామాలకి చెందిన లబ్ధదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో, తహశీల్దార్, భైంసా ఏఎంసీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్ , తానూర్ పిఎస్ చైర్మన్ నారాయణరావు పటేల్ , మండల అధ్యక్షులు లక్ష్మారెడ్డి , మాజీ అధ్యక్షులు, సీనియర్ జర్నలిస్టు చిన్నారెడ్డి , బెల్తరోడ సర్పంచ్ సాయినాథ్ , సీనియర్ నాయకులు శివాజీ పటేల్ , కైలాష్, శేషరావ్, మారుతి ,సోమ్ నాథ్, దేవిదాస్ ఎల్లప్ప, ఆయా గ్రామాల తాజా మాజీ, ప్రజా ప్రతినిధులు , సర్పంచులు ,ఎంపీటీసిలు, మండల నాయకులు , కార్యకర్తలు , మండల ఆయా సంబంధిత అధికారులు, తదితరులు ఉన్నారు.

# యుజిసి పే స్కేల్ తో కూడిన వేతనం కావాలి

నిర్మల్ ప్రతినిధి (మన వెలుగు) జనవరి 10 : అసోసియేషన్ ఆఫ్ అసిస్టెంట్ ప్రొఫెస్సొర్స్ (కాంట్రాక్ట్) సంఘం సభ్యులు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మరియు మాజీ ఎమ్మెల్య్ మైనంపల్లి హనుమంతరావుని బాసరలో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన తర్వాత శాలువాతో సత్కరించారు. తదనంతరం సంఘ అధ్యక్షులు ఉపేందర్ రావు కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెస్సొర్స్ సమస్యలను మైనంపల్లికి వివరిస్తూ మేము ఆర్జియూకెటి (ట్రిపుల్ఐటీ) బాసర విశ్వవిద్యాలయం స్థాపించిన దగ్గర నుండి పనిచేస్తూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందజేస్తూ, వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తూ మన తెలంగాణ అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యాము. కానీ మా జీవితాలు చాలీచాలనీ జీతాలతో అగమ్యగోచరంగా ఉన్నాయి. మా సమస్య పై మీరు చొరవ తీసుకొని గౌరవనీయులైన ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, మాకు యుజిసి పే స్కేల్ తో కూడినటువంటి వేతనాన్ని ఇప్పించాలని వినతి పత్రం ఇవ్వడం జరిగింది. దానికి వారు సానుకూలంగా స్పందిస్తూ మీ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కారం కొరకు చొరవ చూపుతానని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు డాక్టర్ అజయ్, డాక్టర్ రాజేందర్ మరియు సన కుమార్ పాల్గొన్నారు.

# నూతన బార్బర్ షాప్ ని ఓపెనింగ్ చేసిన ఎమ్మెల్యే



**ముధోల్ (మన వెలుగు) జనవరి 10 :** తానూర్ మండలంలోని బోల్సా గ్రామంలో పిఎమ్ విశ్వ కర్మ లబ్దిదారుడు వద్నేంవార్ గంగాధర్ నూతన బార్బర్ షాప్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించిన ముధోల్ శాసన సభ్యులు పవార్ రామారావు పటేల్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, ప్రభుత్వం చేతి వృత్తుల వారిని ప్రోత్సహించేందుకు, వారికి ఆర్థిక స్థిరత్వాన్ని అందించేందుకు అనేక పథకాలు అమలు చేస్తున్నాయన్నారు. వారికి సులభంగా రుణాలిస్తూ.. అవసరమైన నైపుణ్యాలను నేర్పిస్తూ చేయూతనందిస్తున్నాయి. చేతి వృత్తులు, సంప్రదాయ సాధనాలపై ఆధారపడిన కళాకారులకు సమగ్ర సహాయాన్ని అందించాలనే లక్ష్యంతో దీనిని ఏర్పాటు చేశారని ఆయన అన్నారు

# పేకాట స్థావరంపై దాడి

◈ పేకాట ఆడుతున్న 13 మంది అరెస్ట్

◈ 65 వేల నగదు, 9 ద్విచక్ర వాహనాలు, 11 సెల్ ఫోన్ లు స్వాధీనం



**మెట్ పల్లి టౌన్ (మన వెలుగు) జనవరి 10 :** శుక్రవారం తెల్లవారుజామున మెట్ పల్లి మండలంలోని కోణారావుపేట గ్రామ శివారులో అటవీ ప్రాంతంలో గత కొన్ని రోజుల నుండి పేకాట స్థావరం ఏర్పరుచుకొని కొంతమంది పేకాట ఆడుతున్నారని సమాచారం మేరకు మెట్ పల్లి ఎస్ఐ కిరణ్ కుమార్ తన సిబ్బందితో కలిసి రెండు బృందాలుగా ఏర్పడి పేకాట ఆడుతున్న ప్రదేశాన్ని చుట్టుముట్టి పేకాట ఆడుతున్న 13 మంది వ్యక్తులను పట్టుకొని, వారిలో ముష్కర కిషోర్ కథలాపూర్ మండల కేంద్రానికి చెందిన వ్యక్తి గత కొంతకాలంగా ఇతర ప్రాంతాల నుండి పేకాట ఆడుతున్న వాళ్ళని పిలిపించుకుంటూ వారి వద్ద డబ్బులు తీసుకొని పేకాట ఆడిస్తున్నాడని,పేకాట ఆడుతున్న 13 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 65 వేల నగదు, 9 ద్విచక్ర వాహనాలు, 11 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు సిఐ నిరంజన్ రెడ్డి తెలిపారు.



పేకాట ఆడుతూ పట్టుబడిన వాళ్ళు, పుష్కర కిషోర్, తోడేటి చంద్రశేఖర్ కోరుట్ల, కల్లెడ లక్ష్మీ నరసయ్య మోహన్ రావు పేట, ముస్కర సంతోష్ కథలాపూర్, పెద్ద బోయిన శ్రీనివాస్ కోరుట్ల, కందరి నరేష్ రెడ్డి సిరికొండ, ఎండి రఫీదిన్ కోరుట్ల, గోపిడి కృష్ణారెడ్డి దూలూరు, ఆర్య తిరుపతి లొత్తునూరు, మార వెంకట్రెడ్డి సంగం, కనుమల్ల లింగమూర్తి, సుగుణాకర్ రావు జగిత్యాల, చంద్రశేఖర్ రెడ్డి రాయికల్ గ్రామాలకు చెందినవారిగా పోలీసులు ఈ సందర్భంగా సిఐ నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ, మెట్ పల్లి సర్కిల్ పరిధిలో ఎక్కడైనా పేకాట ఆడిన వారిపై చట్టరీత్యా చర్య తీసుకోంటమని హెచ్చరించారు.

## శిశు మందిర్ ను తనిఖీ చేసిన శైక్షనిక్ ప్రముఖ

**ముధోల్ (మన వెలుగు) జనవరి10 :** ముధోల్ మండల కేంద్రములోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలను ఆదిలాబాద్ విభాగ్ శైక్షణిక్ ప్రముఖ్ కలిమహంతి వేణుమాధవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలకు చెందిన పలు రికార్డులను, ఫీజుల వివరాలు పరిశీలించారు. తరగతులలో విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పరిశీలించారు. అనంతరం 10వ తరగతి విద్యార్థులతో సమావేశమై ప్రిపరేషన్ గురించి అడిగి తెలుసుకున్నారు. ఆచార్యులతో సమావేశం అయ్యి మార్గదర్శనం చేశారు.

## సమతా సైనిక్ దళ్ శిక్షణ శిబిరాన్ని విజయవంతం చేయండి




**ముధోల్ (మన వెలుగు) జనవరి 10 :** నిజామాబాద్ జిల్లా మాకూరు మండలం అడివి మామిడిపల్లిలో శనివారం నుండి సమతా సైనికదళ్ శిక్షణా శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఉత్తర తెలంగాణ సమత సైనిక్ దళ్ ఉపాధ్యక్షులు వాగ్మారె నారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండు రోజుల పాటు జరిగే శిక్షణ శిబిరంలో సైనికులు- సైన్యంలో చేరే వాళ్ళు శ్రామినేర్లు -బోద్దాచార్యులు కేంద్రీయ శిక్షకులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమానికి వచ్చే సైనికులు యూనిఫామ్ ధరించి రావాలని అన్నారు. శిక్షణ శిబిరానికి భారతీయ బౌద్ధ మహాసభ తెలంగాణ రాష్ట్ర ప్రభారి సంజయ్ బోధి కస్తూరే, ఉత్తర తెలంగాణ అధ్యక్షులు ప్రభాకర్ గడపాలి హాజరు అవుతున్నట్లు పేర్కొన్నారు. యువకులు సమతా సైనిక్ దళ్లో చేరే విధంగా ప్రోత్సహించాలని ఆదేశాలు వచ్చినట్లు తెలిపారు.

## చెరువుల మరమ్మత్తులపై ప్రధాన దృష్టి

◈ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్

**ముదోల్ (మన వెలుగు) జనవరి 10 :** నియోజకవర్గంలో భారీ వర్షాలతో దెబ్బతిన్న చెరువులకు మరమ్మత్తులు చేపట్టి, రైతాంగానికి సాగునీరు అందించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. శుక్రవారం తానూర్ మండలంలోని బెల్ తరోడ గ్రామంలో రూ.47 లక్షల రూపాయల నిధులతో చెరువు మరమ్మత్తు నిర్మాణ పనులను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. చెరువులు దెబ్బతిన్న విషయాన్ని అసెంబ్లీలో ప్రస్తావించడం జరిగిందని, ప్రభుత్వం దశలవారీగా నిధులు మంజూరు చేస్తుందన్నారు. సిరాల ప్రాజెక్టు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని, అదేవిధంగా తానూర్ మండలంలో హిప్నెల్లి చెరువు మరమ్మతుకు కోటి రూపాయల నిధులు అవసరమవుతాయని, వచ్చే జూన్ వరకు పనులు పూర్తి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి, జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్కకు ఆయన ధన్యవాదాలు చెప్పారు.

## పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు



**ముధోల్ (మన వెలుగు) జనవరి 10 :** మండల కేంద్రమైన ముధోల్ తో పాటు వివిధ గ్రామాల్లోని పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. రబింద్రా ఉన్నత పాఠశాల- శ్రీ సరస్వతి శిశు మందిర్-శ్రీ అక్షర- లిటిల్ ఫ్లవర్ పాఠశాలతో పాటు బ్రాహ్మన్గాం గ్రామంలోని హైందవి పాఠశాలలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ముగ్గుల పోటీలు నిర్వహించి, గాలిపటాలు ఎగరవేశారు. హరిదాసు వేషధారణతో విద్యార్థులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. భోగి మంటలు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో రబింద్రా హైస్కూల్ ప్రిన్సిపల్ అసంవార్ సాయినాథ్, కరస్పాండెంట్ రాజేందర్, డైరెక్టర్ పోతన్న యాదవ్, భీమ్రావు దేశాయ్, శిశుమందిర్ ప్రధాన ఆచార్యులు సారథి రాజు, శ్రీ అక్షర డైరెక్టర్ సుభాష్ పటేల్, లిటిల్ ఫ్లవర్ ప్రిన్సిపల్ నజీబ్, కరస్పాండెంట్ దిగంబర్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన వైకుంఠ ఏకాదశి బందోబస్తు

◈ ధర్మపురిలో బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ



**జగిత్యాల ప్రతినిధి (మన వెలుగు) జనవరి 10 :** వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని జిల్లా ఉన్న వివిధ పుణ్యక్షేత్రాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా పోలీస్ శాఖ పరంగా కావాల్సిన భద్రతాపరమైన ఏర్పాట్లను చేసి ప్రశాంతంగా నిర్వహించడం జరిగిందని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. జిల్లాలో ఉన్న వివిధ పుణ్యక్షేత్రాలకి పెద్ద ఎత్తున భక్తులు వచ్చే దర్శనం చేసుకోవడం జరిగిందని,వివిధ పుణ్యక్షేత్రంలో ఏలాంటి నేరాలకు తావులేకుండా, అవాంఛ నీయ సంఘటనలు జరగకుండ చూసిన పోలీస్ అధికా రులు , క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది కృషిని ఎస్పీ అభినందించారు. అదే విధంగా రానున్న రోజుల్లో కూడా ఇదే స్ఫూర్తిని కనబరుస్తూ ప్రశాంత వాతావరణంలో పండగలను నిర్వహించడానికి పోలీస్ శాఖ తరపున కావాల్సిన భద్రతాపరమైన ఏర్పాట్లు చేయడానికి ఎల్లప్పుడూ ముందుంటామని తెలియజేశారు.ఈ సందర్భంగా ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్పీ స్వయంగా పరిశీలించారు. జిల్లాఎస్పీ వెంట డిఎస్పి రఘు చందర్, ధర్మపురి సి.ఐ రామ్ నర్సింహారెడ్డి, ఎస్.ఐ లు, ఉదయ్ కుమార్, సతీష్, ఉమ సాగర్, శ్రీధర్ రెడ్డి ఉన్నారు

## నకిలీ నోట్లు వస్తున్నాయి జాగ్రత్త...!



**ముధోల్ (మన వెలుగు) జనవరి 10 :** నకిలీ నోట్ల సమస్యతో అల్లాడుతోంది. భైంసా, ఖానాపూర్, తాజాగా జిల్లా కేంద్రంలోనూ రూ.200, రూ.100 నకిలీ నోట్లు వెలుగుచూశాయి. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, నిరక్షరాస్యులను లక్ష్యంగా చేసుకుని, బజార్లలో జనసందడిలో చెలామణి చేస్తున్నారు.ఈ నకిలీ నోట్లు సాధారణ కాగితాన్ని మందంగా మార్చి, కలర్ జిరాక్స్ ద్వారా రూపొందిస్తున్నట్లు సమాచారం. జిల్లాలో వెలుగుచూసిన రెండు రూ.200 నోట్లు ఒకే నంబరు కలిగి ఉండటం ఆశ్చర్యంగా మారింది. చిన్న నోట్లు సులభంగా మార్చి పారిపోవచ్చన్న ఆలోచనతో దోపిడీదారులు ఈ మార్గం ఎంచుకుంటున్నారు.నిర్మల్ జిల్లాలో బెట్టింగ్ నిర్వహణలో భాగంగా నకిలీ నోట్లు చెలామణి చేస్తున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండి, లావాదేవీల సమయంలో నోట్లను సరిచూసి స్వీకరించాల్సిన అవసరం ఉంది.

## 13న హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



**ముధోల్ (మన వెలుగు) జనవరి 10 :** హిందూ ఉత్సవ సమితి భైంసా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 13న పట్టణంలోని శ్రీ లక్ష్మీనరసింహ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ పోటీల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని గెలుపొందిన వారికి ప్రథమ బహుమతిగా 50 గ్రాముల వెండి నాణెం, ద్వితీయ బహుమతిగా 30 గ్రాముల వెండి నాణెం, తృతీయ బహుమతిగా 20 గ్రాముల వెండినాణెం, పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రోత్సాహక బహుమతులు అందజేయడం జరుగుతుందని హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు పెండేపు కాశీనాథ్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు తుమోల్ల దత్తాత్రి, మల్లేష్, డా.నగేష్, జి.రాజేశ్వర్, సుందర్ భయ్య, శ్రీనివాస్, విరాట్, ఆర్.రాజేశ్వర్, యోగేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు



**ముదొల్ (మన వెలుగు) జనవరి 10 :** ముధోల్ మండలంలోని అష్ట గ్రామంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీ రామచంద్రుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పంచామృత అభిషేకాలు- కుంకుమ అభిషేకాలు నిర్వహించి భక్తులకు ఉత్తర ముఖ ద్వారం ఏర్పాటు చేసి భక్తులకు ప్రత్యేక దర్శనం చేయించడం జరిగింది. ఇందులో భాగంగా రావుల శ్రీనివాస్ రావుల -లావణ్య హారతి ఇవ్వగా హారతిలో సాక్షాత్తు వినాయక రూపంలో దర్శనం కనిపించడం విశేషం. శ్రీ రామచంద్రుని ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఈ కార్యక్రమంలో సునీల్ గురు స్వామి, ప్రసాద్ స్వామి, విశ్వకర్మ సంఘ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు కండల అశోక్, రావుల పోశట్టి, మాజీ ఎంపిటిసి పోశట్టి, బొంగు సాయిలు, గంగాధర్, భోజన్న, ఆనంద్, స్వరాజ్, భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రావుల శ్రీనివాస్ మాట్లాడుతూ రామాలయం మహా పుణ్యక్షేత్రంగా ఆవిర్భవిస్తుందని తెలియజేశారు.

## సంబురంగా సంక్రాతి వేడుకలు


**బాసర (మన వెలుగు) జనవరి 10 :** ముగ్గుల పోటీ,పతంగుల ఎగురవేత,సోన్ మండలం లోని సిద్దుల కుంట ఉన్నత పాఠశాలలో బాలికలకు ముగ్గుల పోటీలు, బాలురకు పతంగుల ఎగురవేత పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప ప్రధానో పాధ్యాయులు చంద్రశేఖర రావు, ఉపాధ్యాయులు కడారి దశరథ్,టి నరేందర్, భూమా రెడ్డి, బి నరేందర్,ముర్తుజా ఖాన్ విద్యార్థులు పాల్గొన్నారు.

## వైభవంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు

ఖానాపూర్, (మన వెలుగు) జనవరి 10 : భైంసా పట్టణంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలను శుక్రవారం వైభవంగా నిర్వహిస్తున్నారు. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని వేకువజాము నుండి భక్తులు క్యూలైన్లలో నిలబడి స్వామి వారిని దర్శించుకున్నారు. ఉత్తర ద్వారం ద్వారా స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లను చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

## ఒంట్లో ఈ పార్ట్‌పై పుట్టుమచ్చ ఉంటే
# అదృష్ట దేవత తాండవం చేస్తుందట!

కొంత మంది పుట్టుమచ్చలు ఉన్న స్థానాన్ని బట్టి అదృష్టం వరిస్తుందని విపరీతంగా నమ్ముతారు. సాముద్రిక శాస్త్రం ప్రకారం పుట్టు మచ్చ స్థానాన్ని బట్టి ఆ వ్యక్తులు భవిష్యత్తులో ఎలా ఉంటారో, వారి జీవితం ఏ విధంగా ఉండబోతుందో చెప్పొచ్చు. అయితే వీటికి ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లేకపోయినప్పటికీ కొందరు మాత్రం నిజమేనని విశ్వసిస్తారు. అలాంటి వారి కోసం ఇక్కడ కొంత సమాచారం ఇచ్చాం. సాధారణంగా ప్రతి ఒక్కరి శరీరంపై పుట్టుమచ్చలు ఉంటాయి. అయితే ఒక్కో భాగంలో ఉండే పుట్టుమచ్చ ఆ వ్యక్తి భవిష్యత్తులు ఏ విధంగా నిర్ణయిస్తుందో సాముద్రిక శాస్త్రం వివరిస్తుంది. సాముద్రిక శాస్త్రం ప్రకారం.. శరీరంలోని వివిధ భాగాలలో పుట్టుమచ్చలు అందాన్ని పెంచడమే కాకుండా అదృష్టాన్ని కూడా సూచిస్తాయి. ఆ వ్యక్తి బలాలు, బలహీనతలను కూడా తెలుసుకోవడానికి ఇవి ఉపయోగపడతాయి. ముఖ్యంగా శరీరంలోని ఈ భాగాలపై పుట్టుమచ్చలు శుభ, అశుభ సంకేతాలను తెల్పుతాయి.



సాముద్రిక శాస్త్రం ప్రకారం.. ముక్కు కొనపై పుట్టుమచ్చ ఉన్న వ్యక్తి వివిధ ప్రతిభల్లో ఆరితేరి ఉంటారు. అలాంటి వ్యక్తి చాలా అదృష్టవంతుడు. జీవితంలో సంతోషంతోపాటు సంపన్నుడు కూడా అవుతాడు. అలాంటి వ్యక్తులు వారి వృత్తి, వ్యాపారాలలో గణనీయమైన పురోగతిని సాధిస్తారు. ముక్కు కుడి వైపున పుట్టుమచ్చ ఉన్న స్త్రీలకు వారి తల్లిదండ్రుల నుంచి మరింత గౌరవం, మద్దతు లభిస్తుంది. కానీ ముక్కు పైభాగంలో అంటే కనుబొమ్మల దగ్గర పుట్టుమచ్చ ఉంటే ఆర్థికంగా కష్టాలు, ఉద్యోగం రావడం కష్టం అవుతుంది. ఆర్థిక అస్థిరత కూడా ఉంటుంది. సాముద్రిక శాస్త్రం ప్రకారం.. చెవిలో పుట్టుమచ్చ ఉన్నవారు చాలా నిజాయితీపరులు. అలాంటి వ్యక్తి ఒక్కసారి నిర్ణయం తీసుకుంటే దాన్ని పూర్తి చేసేంత వరకు నిద్రపోరు. చెవి క్రింద పుట్టుమచ్చ ఉన్న వ్యక్తులు స్వభావంలో చాలా భావోద్వేగాన్ని కలిగి ఉంటారు. చిన్న చిన్న విషయాలను కూడా మనసుకు తీసుకుంటారు. అంటే చాలా సున్నిత మనస్కులన్నమాట. కంటిలో మచ్చ ఉన్న వ్యక్తులు ఇతరులను సులభంగా ఆకర్షిస్తారు. అలాంటి వ్యక్తులు చాలా అదృష్టవంతులు. ప్రతి అడుగులో విజయం సాధిస్తారు. ఇలాంటి వారికి డబ్బుకు లోటు ఉండదు. పై పెదవికి కుడి వైపున పుట్టుమచ్చ ఉన్నవారు చాలా అదృష్టవంతులని నమ్ముతారు. వారు జీవితంలో అన్ని రకాల సుఖాలు, విలాసాలను చాలా సులభంగా పొందుతారు. అలాంటి వ్యక్తులు ప్రేమలో విజయం సాధిస్తారు. పెదవికి ఎడమ వైపున పుట్టుమచ్చ ఉంటే అశుభంగా భావిస్తారు.

## మీ భాగస్వామిలో ఈ మార్పులు కనిపిస్తే..?

భార్యాభర్తల బంధం నిండు నూరేళ్ళు సుఖ సంతోషాలతో సాగిపోవాలంటే.. భార్య, భర్తల మధ్య ఉండాల్సింది. ఒకరిపై ఒకరికి నమ్మకం. వైవాహిక జీవితంలోకి ప్రవేశించిన తర్వాత జీవిత భాగస్వామితో నిజాయితీగా ఉండాలి. అప్పుడే ఆ బంధం శాశ్వతంగా ఉంటుంది. అయితే ఇటీవలి కాలంలో చాలా మంది తమ భాగస్వామిని మోసం చేస్తూ.. వేరేక వ్యక్తితో అక్రమ సంబంధం పెట్టుకుంటున్న వార్తలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మీ భాగస్వామి మిమ్మల్ని మోసం చేస్తున్నారో లేదో తెలుసుకోవడానికి.. వ్యక్తిలో ఈ మార్పులను గమనించండి. వ్యక్తి ప్రవర్తనలో మార్పులు వస్తే మీరు ఖచ్చితంగా మోసపోతున్నట్లు లెక్కే. సంబంధాలు చాలా సున్నితమైనవి. ఏదైనా సంబంధాన్ని చాలా జాగ్రత్తగా చూసుకోవాలి. ముఖ్యంగా భార్యాభర్తల మధ్య సంబంధం అందంగా సాగిపోవాలంటే.. నీతి నిజాయతీగా సాగిపోవాలి. అయితే కొన్నిసార్లు జీవిత భాగస్వామి మరొక వ్యక్తి పట్ల ఆకర్షితులవుతారు. అప్పుడు జీవిత భాగస్వామి వైఖరి, ప్రవర్తన కారణంగా సంబంధం నాశనం అవుతుంది. అప్పుడు దంపతుల మధ్య వివాదాలు మొదలవుతాయి. భార్యాభర్తల బంధం తెగిపోవడానికి ఇదే ప్రధాన కారణం. కనుక వైవాహిక జీవితంలో తమ భాగస్వామి తమని మోసం చేస్తున్నాడో లేదో తెలుసుకోవాలంటే.. కొని టిప్స్ ఉన్నాయి. ముఖ్యంగా భాగస్వామిలో కొన్ని రకాల మార్పులు వస్తుంటే అప్పుడు ఆలోచనాలో పడాల్సిందే.. కనుక ఆ వ్యక్తిలో ఈ మార్పులు ఉన్నాయో లేదో చెక్ చేయండి.. వ్యక్తిగత దూరాన్ని పాటిస్తుంటే: ఈ మార్పు వస్తుంటే మోసం చేసిన లేదా మోసం చేస్తున్న జీవిత భాగస్వామి ప్రవర్తనలో ప్రధాన అంశం. తమ జీవిత భాగస్వామితో అప్పటి వరకూ ఎక్కువ సమయం గడిపే వ్యక్తి.. అకస్మాత్తుగా దూరం పెట్టడం మొదలు పెడతాడు. జీవిత భాగస్వామితో మాట్లాడటానికి అయిష్టతను వ్యక్తం చేస్తూ ఉంటాడు. భార్యాభర్తలు మాట్లాడుకోవడం తగ్గి పోట్లాడుకోవడం ఎక్కువ అవుతుంది. చిన్న చిన్న విషయాలకు కోపం, కేకలు వేయడం వంటి ప్రవర్తన కనిపిస్తుంటే జీవిత భాగస్వామి తో సంబంధం ఇష్టం లేదని అర్థమట. ఆలోచనలను దాచిపెట్టే ప్రయత్నాలు : వైవాహిక జీవితంలో ఎలాంటి దాపరికం లేని వ్యక్తి.. నిజాయితీపరుడిగా ఉండే వ్యక్తిలో హటాత్తుగా మార్పు వస్తే.. అంటే తన భార్యతో అప్పటి వరకూ అన్ని విషయాలు చెప్పే వ్యక్తీ.. హటాత్తుగా దాచిపెట్టే ప్రయత్నం చేస్తుంటే%ా% అంటే సోషల్ మీడియాలో తనకు వచ్చిన మెసేజ్ లు డిలీట్ చేయడం. తరచుగా ఫోన్ కాల్స్ చేయడం.. ఫోన్ కాల్స్ లిస్టు ని డిలీట్ చేయడం వంటివి భర్తలో నిజాయతీ లోపిస్తుందని అర్థం. ఫోన్‌లో పాస్‌వర్డ్ , లాక్‌లు పెట్టడం అంటే జీవిత భాగస్వామి నుంచి ఏదో దాస్తున్నాడని అర్థం. ఎప్పుడూ ఫోన్ లేదా టెక్స్ట్‌లో మునిగిపోతే : వైవాహిక జీవితంలో ఇద్దరూ కలిసి ఉన్నప్పటికీ.. సాన్నిహిత్యం ఉండదు. జీవిత భాగస్వామి ఫోన్‌లో ఎక్కువ సమయం గడుపుతుంతే.. ఏ చిన్న శబ్దం వచ్చినా ఫోన్ వైపు చూస్తే అతను మరొక వ్యక్తితో సాంగత్యాన్ని పెంచుకున్నాడని అర్థం. అంతే కాకుండా తన ఫోన్ ని భాగస్వామి తాకితే కోపం రావడం, పాస్‌వర్డ్ అడిగితే సబ్జెక్ట్‌ని డైవర్ట్ చేయడం వంటి లక్షణలు కనిపిస్తే దాంపత్య జీవితం తప్పు దారిలో పడుతోందని అనుమానించాల్సి ఉంటుంది. శారీరక సాన్నిహిత్యం లేకపోవడం : మీరు మీ భాగస్వామితో ప్రేమతో మాట్లాడటానికి దగ్గరకు వెళ్తే.. మీరు మాటలపై ఆసక్తి చూపించిక పోయినా.. మీరు దగ్గరవుతున్నప్పటికీ మిమ్మల్ని దూరం పెట్టడానికి ప్రయత్నిస్తుంటే.. అప్పుడు మీ భర్త ప్రవర్తనపై దృష్టి పెట్టండి. భార్య ఏ చిన్న పని చేసినా.. చిరాకు పడుతుంటే.. భౌతిక దూరం పాటిస్తే అప్పుడు సంబంధంలో నిజాయితీ లోపించింది అని గ్రహించండి. వీలైతే ఇద్దరూ కూర్చొని ఈ విషయం గురించి ఓపెన్ గా మాట్లాడుకుని రిలేషన్ షిప్ కుదుర్చుకుంటే బాగుంటుంది. లేదంటే భార్య భర్తల మధ్య బంధం బీటలు వారి విడిపోయే ప్రమాదం కూడా ఉంది.



# ఇంట్లోనే ఎగ్ లెస్ వెనిలా కేక్‌ని
# తయారు చేసుకోండి ఇలా

ప్రస్తుతం కేక్ తినే ఆహారంలో ముఖ్యమైన భాగంగా మారిపోయింది. పెళ్ళిళ్ళు, ఫంక్షన్లు, పుట్టిన రోజులు ఇలా ఎ సందర్భంలోనైనా తమ సంతోషాన్ని కేక్ కట్ చేసి వ్యక్తం చేస్తున్నారు. దీంతో మార్కెట్ లో రకరకాల కేక్ లు అందుబాటులోకి వచ్చాయి. ఎగ్ తో చేసిన కేక్ లు మాత్రమే కాదు.. ఎగ్ లేకుండా కూడా కేక్ ప్రియులను అలరిస్తున్నాయి. అయితే బేకరీలలో దొరికే కేక్ లలో కొన్ని రకాల పదార్థాలు ఆరోగ్యానికి మంచివి కావని పిల్లలు ఎంతగా అడిగినా ఇవ్వడానికి కేక్ ను కొనివ్వడానికి ఇష్టపడరు. ఈ నేపథ్యంలో ఈ రోజు కోడి గుడ్డు లేకుండా వెనిలా కేక్ తయారీ గురించి తెలుసుకుందాం. కేక్‌ల్లో చాలా రకాలున్నాయి. అయితే వీటిల్లో వెనిలా కేక్ పిల్లలు, పెద్దలు ఇష్టపడే క్లాసిక్ కేక్. ఈ కేక్ తయారు చేయడానికి రకరకాలు పద్ధతులున్నాయి. కొంత మంది గుడ్డుని ఉపయోగించి కేక్ ను తయారు చేస్తారు. దీనిని ఇష్టంగా తింటారు కూడా.. అయితే మరికొందరికి కేక్ అంటే ఇష్టం ఉన్నా.. గుడ్డు ఉంది అని తినరు. అలాంటి వారి కోసం ఎగ్ లెస్ కేక్ ని తయారు చేసి ఇవ్వవచ్చు. అది కూడా ఇంట్లో ఉండే వస్తువులతోనే చాలా సింపుల్ పద్దతిలో ఎటువంటి కష్టం లేకుండా ఎగ్‌లెస్ కేక్‌ను తయారు చేయవచ్చు. ఈ రోజు వెనిలా ఎగ్‌లెస్ కేక్ తయారీ విధానం తెలుసుకుందాం.వెనిలా ఎగ్‌లెస్ కేక్ తయారీకి కావాల్సిన పదార్థాలు..వంట నూనె- 40 గ్రాముల/ మైదా- 85 గ్రా/ చక్కెర- 55 గ్రాముల పొడి/ పాలు- 90 / పాల పొడి- 1 1/2 స్పూన్/ వెనిగర్- 1/2 స్పూన్/ వెనిలా ఎసెన్స్- 1/2 టీస్పూన్/ కార్న్‌ఫ్లోర్- 2 1/4 స్పూన్/ బేకింగ్ పౌడర్- 1/2 ం 1/8 టీస్పూన్/ బేకింగ్ సోడా- 1/8 టీస్పూన్/ ఉప్పు- 1/8 స్పూన్తయారీ విధానం: ముందుగా పాలను తీసుకుకుని అందులో వెనిగర్ కలపండి. ఇప్పుడు ఈ మిశ్రమాన్ని 10 నిమిషాలు పక్కన పెట్టండి. మరొక గిన్నె తీసుకుని ఇప్పుడు నూనె, షుగర్ పౌడర్ ని తీసుకుని.. కొంచెం సేపు మిక్స్ చేసి.. అందులో వెనిగర్ పాలు మిశ్రమాన్ని వేసి బాగా కలపండి. పాలుగా అయ్యే వరకూ మిశ్రమాన్ని కలిపి అప్పుడు అందులో తీసుకున్న పదార్థాలను అంటే.. వెనిలా ఎసెన్స్, మైదా, పాల పొడి, బేకింగ్ సోడా, బేకింగ్ పౌడర్, ఉప్పు, కార్న్‌ఫ్లోర్ జోడించండి. ఇప్పుడు ఈ పిండి మృదువుగా అయ్యేంత వరకూ బాగా కలపండి. ఇప్పుడు ఒక దళసరి గిన్నె తీసుకుని లోపల అంచులకు కొంచెం నూనె రాసి.. బటర్ పేపర్ వేసి అప్పుడు రెడీ చేసుకున్న మిశ్రమాన్ని వేసి సరి చేసి.. ఓవెన్ లో పెట్టి.. 160 డిగ్రీల వద్ద 25-30 నిమిషాలు పాటు బేక్ చేయండి. ఒకవేళ ఓవెన్ లేకపోతే కుక్కం తీసుకుని అందులో కొంచెం ఇసుక పోసి.. అప్పుడు ఒక గిన్నె పెట్టి దాని మీద కేక్ మిశ్రమం వేసుకున్న గిన్నెను పెట్టండి. కేక్ ఉడికిందో లేదో తెలుసుకునేందుకు ఒక టూత్ పిక్ ని గుచ్చి చూడండి.. పుల్లకు ఎటువంటి పిండి అంటుకోక పొతే కేక్ ఉడికినట్లు. అంతే టేస్టీ టేస్టీ వెనిలా ఎగ్‌లెస్ కేక్ రెడీ.



## నల్లగా ఉన్నా తగ్గేదేలే నల్లక్యారెట్ హల్వా..

చలికాలంలో క్యారెట్ హల్వా తినడం విభిన్నమైన ఆనందాన్ని ఇస్తుంది. అయితే హల్వా లో అనేక రకాలున్నాయి. క్యారెట్ హల్వా, సుజీ హల్వా, గాజర్ హల్వా, బీట్ రూట్ హల్వా వంటి అనేక రకాల హల్వాలు తరచుగా కనిపిస్తాయి. అయితే ఎక్కువగా హల్వా పసుపు, నారింజ రంగు క్యారెట్ లతో తయారు చేస్తారు. అయితే భారతదేశంలో బ్లాక్ క్యారెట్ హల్వా దొరుకుతుందని మీకు తెలుసా? అవును నల్ల క్యారెట్ హల్వాను నవాబుల నగరమైన లక్నోలో తయారు చేస్తారు. చలికాలం రాగానే అందరూ వేడివేడిగా క్యారెట్ హల్వా తినాలనుకుంటారు. ఎరుపు లేదా పసుపు క్యారెట్‌లతో తయారు చేయబడిన ఈ సాంప్రదాయ స్వీట్.. నెయ్యి, డ్రై ఫ్రూట్స్ తో తయారు చేస్తారు. భిన్నమైన టేస్ట్ తో ప్రసిద్ధి చెందింది. అయితే క్యారెట్ హల్వాకు ప్రత్యేకమైన గుర్తింపు.. టెస్టు ఇచ్చే భారతదేశంలో ఒక నగరం ఉందని మీకు తెలుసా? ఈ నగరంలో క్యారెట్ హల్వాను నలుపు క్యారెట్‌లతో తయారు చేస్తారు. ఈ హల్వాకు ప్రత్యేకమైన రంగు ఉన్నప్పటికీ రుచి విషయంలో ఎక్కడా తగ్గేదే లే అంటుంది. ఈ ప్రత్యేక హల్వా లక్నోలో దొరుకుతుంది. చలికాలంలో లక్నోలోని స్వీట్ షాపుల్లో బ్లాక్ క్యారెట్ హల్వా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. సోషల్ మీడియాలో మరూఫ్ కుల్మాన్ అనే వినియోగదారుడు ఇటీవల తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక వీడియోను షేర్ చేశారు. అందులో లక్నోలో ఈ హల్వా చాలా స్పెషల్. అంటూ దీని ప్రత్యేకత గురించి చెప్పాడు. "శీతాకాలంలో లక్నో అనేక రకాల ఆనందాలను అనుభవించవచ్చు. అయితే బ్లాక్ క్యారెట్ హల్వా మాత్రం చాలా ప్రత్యేకంగా నిలుస్తుంది. రెడ్ క్యారెట్ హల్వాలా కాకుండా.. ఇది అరుదైన స్వీట్. ఇది శీతాకాలంలో మాత్రమే లభిస్తుంది. దీనికి కారణం నల్ల క్యారెట్ పంట చాలా పరిమితంగా ఉంటుంది. కొంతమంది రైతులు మాత్రమే దీనిని పండిస్తారు. ఈ హల్వా చాలా ప్రత్యేకమైనది. మరూఫ్ వీడియో ప్రకారం.. ఈ ప్రత్యేకమైన హల్వాను తయారు చేయడానికి చాలా కష్టపడాల్సి ఉంటుంది. స్థానిక మిఠాయి దుకాణంలోని తయారీదారులు స్థానిక రైతుల నుంచి ఎంపిక చేసిన నల్ల క్యారెట్లను ఖరీదు చేస్తారు. దీని తరువాత వాటిని బాగా శుభ్రం చేసి కడుగుతారు. తర్వాత వాటిని తురుముతారు. అలా తురిమిన క్యారెట్లను పాలలో ఉడికించి.. బాగా దగ్గరగా అయిన తర్వాత ఈ మిశ్రమాన్ని దేశీ నెయ్యిలో బాగా వేయిస్తారు బాగా చిక్కగా దగ్గరగా వచ్చిన తర్వాత జీడిపప్పు, బాదంపప్పులు జోడిస్తారు. బ్లాక్ క్యారెట్ హల్వా రుచిలో సాటిలేనిది మాత్రమే కాదు. ఇది తక్కువగా దొరుకుతుంది. ఈ హల్వా శీతాకాలంలో మాత్రమే అందుబాటులో ఉంటుంది. ఎందుకంటే నల్ల క్యారెట్లను చల్లని వాతావరణంలో మాత్రమే పండిస్తారు. దాని తీపి, నెయ్యి సువాసన, డ్రై ఫ్రూట్ అదనపు రుచిని ఇస్తాయి. దీంతో దీనిని తినే వారి హృదయాలలో ప్రత్యేక స్థానం లభిస్తుంది. మీరు శీతాకాలంలో లక్నో సందర్శించాలని ప్లాన్ చేస్తుంటే, ఈ స్పెషల్ బ్లాక్ క్యారెట్ హల్వాని తప్పకుండా ప్రయత్నించండి. ఇది కేవలం స్వీట్ మాత్రమే కాదు ఒక మధుర జ్ఞాపకం కూడా.



# జుట్టు రాలిపోవడానికి కారణాలు




అందరికీ తల మీద వెంట్రుకలు నిరంతరం ఒకేలా ఉండవు. అవి నిరంతరం పుట్టి, పెరిగి, రాలిపోతుంటాయి. జుట్టు అసహజంగా రాలిపోవడం చాలామందిలో కనిపిస్తుంది. ఈ సమస్యను ఆరోగ్య సమస్యగా గుర్తించకుండా సౌందర్య సమస్యగా భావించరాదంటున్నారు ఆరోగ్య నిపుణులు. కానీ, ఇది పోషకాహార లోపం, హార్మోనుల సమస్యలు, మానసిక ఆందోళనలు, నిద్రలేమి, వంశపారంపర్య సమస్యలు, వ్యాధులు, మందుల వాడకం వంటి కారణాలతో జుట్టు రాలిపోవడం ఎక్కువగా జరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. సహజసిద్ధంగా వెంట్రుకలు ఊడిపోవడం సాధారణమే అయినా శరీర జీవ క్రియలలో మార్పుల వల్ల జుట్టు రాలిపోతుంటే అది అనారోగ్యంగా భావించాలి. స్త్రీలలో సాధారణంగా గర్భధారణ తర్వాత హార్మోన్లు పెరగడం వల్ల జుట్టు కూడా పెరుగుతుంది. ప్రసావానంతరం హార్మోన్లు తగ్గి అందులో అసమతుల్యత కారణంగా, ప్రసవం తర్వాత ఆర్నెల్ల వరకు జుట్టు ఎక్కువగా రాలిపోతుంది. స్త్రీలలో అధిక రుతుస్రావం వల్ల కూడా ఐరన్ లోపంతో జుట్టు రాలిపోవచ్చు. శరీరంలో తలపై ఉన్న జుట్టు మొత్తం రాలిపోతే అలోపిషియా టోటాలిస్, శరీరంపై వెంట్రుకలన్నీ రాలిపోతే అలోపిషియా యూనివర్సాలిస్ అంటారు. ఒక్కోసారి ఏ కారణంల లేకుండా తలలో ఒక భాగంలో జుట్టు ఊడిపోయి మచ్చలా ఏర్పడుతుంది. క్రమంగా తలలో ఇతర భాగాల్లో కూడా ఇలా జరగొచ్చు. దీనిని అలోపిషియా ఏరియేటా అంటారు. గడ్డాలు, మీసాలు, కనుబొమ్మల్లో కూడా ఇలా జరగొచ్చు. టైఫాయిడ్ వంటి దీర్ఘకాలిక జ్వరాలు, ప్రొటీన్స్, ఐరన్ లోపం, విటమిన్ ఎ ఎక్కువగా వాడినా జుట్టు రాలే సమస్యలు రావచ్చు. దీర్ఘ కాలిక వ్యాధులు, క్యాన్సర్లలో జుట్టు రాలిపోయే సమస్య కనిపిస్తుంది. వివిధ రకాల మందుల వల్ల కూడా జుట్టు బాగా రాలిపోతుంది. తలలో వచ్చే ఇన్‌ఫెక్షన్ల వల్ల కుదుళ్ల దెబ్బతిని జుట్టు రాలిపోయే అవకాశం ఉంటుంది. రకరకాల మందుల వల్ల కూడా జుట్టు రాలడం సమస్యలు వస్తాయి. జుట్టును బిగుతుగా కట్టడం, షాంపులు అధికంగా వాడటం వల్ల కూడా జుట్టు రాలిపోతుంది. ఎక్కువగా దువ్వెనతో దువ్విన జుట్టు కుదుళ్లకు నష్టం కలుగుతుంది. దువ్వెన దంతాలు మృదువుగా ఉండాలి. బహిష్టు ఆగిపోయిన స్త్రీలలో టెస్టోస్టిరాన్ హార్మోన్ వల్ల జుట్టు తగ్గిపోవడం జరుగుతుంది.

# పవన్ కళ్యాణ్ హీరోయిన్‌కు వేధింపులు



సినీ తారలు, ప్రముఖులను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో వేధింపులు, బెదిరింపులు ఇటీవల పెరిగిపోతున్నాయి. తాజాగా హీరోయిన్ నిధి అగర్వాల్ కూడా ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. తనపై సోషల్ మీడియా ద్వారా వేధింపులకు పాల్పడుతున్న వ్యక్తిపై సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనను చంపేస్తానంటూ సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న వ్యక్తిని నిర్దేశించి నిధి ఫిర్యాదు చేశారు. ఆ వ్యక్తి తనకు దగ్గరి వారిని కూడా లక్ష్యంగా చేసుకుని బెదిరింపులకు పాల్పడుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ ఘటన తనను మానసికంగా తీవ్ర ఒత్తిడికి గురి చేసిందని, నిందితుడిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. నిధి అగర్వాల్ ఫిర్యాదును స్వీకరించిన సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడి వివరాలు సేకరించి, అతడిపై కఠిన చర్యలు తీసుకోవాలని నిధి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం నిధి అగర్వాల్ ప్రముఖ హీరోలతో పాన్ ఇండియా చిత్రాల్లో నటిస్తున్నారు. ప్రభాస్‌తో రాజాసాబ్, పవన్ కళ్యాణ్ సరసన హరి హర వీర మల్లు చిత్రాల్లో కథానాయికగా నటిస్తున్నారు. ఈ రెండు చిత్రాలు కూడా భారీ అంచనాలతో విడుదలకు సిద్ధమవుతున్నాయి.

# గేమ్ ఛేంజర్ పబ్లిక్ టాక్




గేమ్ ఛేంజర్..గేమ్ ఛేంజర్..గేమ్ ఛేంజర్ ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లోనే కాదు యావత్ వరల్డ్ వైడ్ గా మారుమోగుతున్న పేరు. గ్లోబల్ స్టార్ గా మారిన రామ్ చరణ్..గేమ్ ఛేంజర్ తో మరోసారి తన సత్తా చాటేందుకు ఈరోజు ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. సంచలన దర్శకుడు శంకర్ డైరెక్షన్లో తెరకెక్కిన ఈ చిత్రం సంక్రాంతి రేసులో బరిలోకి దిగింది. దాదాపు మూడేళ్ళ పాటు చిత్రీకరణ జరుపుకున్న ఈ మూవీ ఎలా ఉంటుందో..? రామ్ చరణ్ యాక్టింగ్ ఎలా ఉందొ..? కథ ఏంటో..? శంకర్ ఏ రేంజ్ లో తెరకెక్కించాడో..? అంటూ అభిమానులు కొద్దీ రోజులుగా ఎదురుచూస్తూ వచ్చారు. ఇక ఆ ఎదురుచూపులు తెరపడింది. వరల్డ్ వైడ్ గా పలు భాషల్లో ఈ మూవీ రిలీజ్ అయ్యింది. ఇక ఈ సినిమా చూసిన అభిమానులు , సినీ ప్రేక్షకులు సినిమా ఎలా ఉందొ..సోషల్ మీడియా వేదికగా తమ అభిప్రాయాలను పంచుకుంటున్నారు. హీరో ఎంట్రీ అదిరిపోయిందని, ఇంటర్వెల్ సినిమాకే హైలెట్ అవుతుందని , ప్రథమార్ధంలో వచ్చే డోప్ సాంగ్ పిక్చరైజేషన్, అసలు ఆ పాటను అలా ఆలోచించడం గ్రేట్ అని అంటున్నారు. ఫస్ట్ హాఫ్‌లో ఐఏఎస్‌గా రామ్ నందన్ యాక్టింగ్, కియారాతో జోడి, ఇంటర్వెల్ బ్లాక్ ఇవన్నీ సినిమాకు హైలెట్ అవుతాయని కొంతమంది అంటున్నారు. ఇక రామ్ చరణ్ యాక్టింగ్‌కు వంక పెట్టలేమని చెబుతున్నారు. అయితే కొంత మంది మాత్రం ఎమోషనల్‌గా కనెక్ట్ కాలేకపోతోంది అని చెబుతున్నారు. ఇంటర్వెల్‌కు వచ్చే ట్విస్ట్‌తో అందరికీ మైండ్ బ్లాక్ అవుతుంది. అదే ఈ ఫస్ట్ హాఫ్ మొత్తానికి హైలెట్ అవుతుందని అంతా అంటున్నారు.

# కావేరి పాత్ర ఛాలెంజింగ్‌గా అనిపించింది



వరుస ఘన విజయాలతో దూసుకుపోతున్న గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ ఈ సంక్రాంతికి 'డాకు మహారాజ్' చిత్రంతో అలరించనున్నారు. బ్లాక్ బస్టర్ దర్శకుడు బాబీ కొల్లి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. తమన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రంలో ప్రగ్యా జైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్ కథానాయికలు. సంక్రాంతి కానుకగా ఆదివారం 'డాకు మహారాజ్' చిత్రం ప్రపంచ వ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల కానుంది. ఈ సందర్భంగా కథానాయిక ప్రగ్యా జైస్వాల్ మీడియాతో మాట్లాడుతూ "అఖండ, డాకు మహారాజ్, అఖండ -2.. ఈ విధంగా బాలకృష్ణతో వరుసగా సినిమా చేసే అవకాశం రావడం గౌరవంగా భావిస్తున్నాను. డాకు మహారాజ్ లాంటి మంచి సినిమాలో బాలకృష్ణతో కలిసి నటించడం సంతోషంగా ఉంది. డాకు మహారాజ్ ఘన విజయం సాధిస్తుందని, ఈ చిత్రంలోని నా పాత్రను ప్రేక్షకులు ఆదరిస్తారని నమ్ముతున్నాను. ఇందులో నేను కావేరి పాత్ర పోషించాను. నటనకు ఆస్కారమున్న మంచి పాత్ర ఇది. డీ గ్లామరస్ రోల్ చేశాను. నేను ఇప్పటివరకు పోషించిన పాత్రలకు భిన్నంగా ఉంటుంది. కావేరి పాత్రను బాబీ డిజైన్ చేసిన తీరు బాగుంది. ఈ పాత్ర నాకు నటిగా ఛాలెంజింగ్‌గా అనిపించింది. కావేరి పాత్రతో పాటు ఈ సినిమాలోని ప్రతి పాత్రకు ప్రాధాన్యత ఉంటుంది. బాబీ కథ చెప్పినప్పుడే ఇది మంచి చిత్రం అవుతుందని నమ్మాను. నేను ఊహించిన దానికంటే గొప్పగా ఈ చిత్రాన్ని రూపొందించారు. బాలకృష్ణని సినిమాలో చాలా కొత్తగా చూపించారు. విజువల్స్ కూడా అద్భుతంగా ఉంటాయి. తెలుగులో అగ్ర నిర్మాణ సంస్థల్లో ఒకటైన సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో నటించే అవకాశం రావడం ఆనందంగా ఉంది. నాగవంశీ గొప్ప నిర్మాత. దర్శకులను, టీంని ఎంతో నమ్ముతారు.

# గాంధీ తాత చెట్టు' ట్రైలర్ విడుదల




స్టార్ డైరెక్టర్ సుకుమార్ కుమార్తె సుకృతివేణి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'గాంధీతాత చెట్టు'. ఈ మూవీ ట్రైలర్‌ను కథానాయకుడు మహేష్‌బాబు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి మనస్సులను హత్తుకునేలా సినిమా ఉండేలా ఉందన్నారు. సుకృతి, చిత్ర యూనిట్ అందరికీ అభినందనలు తెలియజేశారు. ఈ మేరకు ట్విట్టర్‌లో పోస్టుచేశారు. తాజాగా విడుదలైన గాంధీతాత చెట్టు ట్రైలర్ చూస్తే ఓ బాలిక ఇచ్చిన మాట కోసం గాంధీ మార్గాన్ని ఎంచుకున్న కథగా తెరకెక్కించినట్లు అర్థమవుతోంది. గాంధీ పేరు పెట్టుకున్న ఓ అమ్మాయి.. ఆయన బాటను, సిద్ధాంతాలను అనుసరిస్తూ, తన తాతకు ఇష్టమైన చెట్టును, తన ఊరును ఎలా రక్షించుకుంది అనే కథాంశంతో సినిమా తెరకెక్కినట్లుగా తెలుస్తోంది. ఈనెల 24న సినిమాను విడుదల చేస్తున్నామని దర్శకురాలు పద్మావతి తెలిపారు. ఈ చిత్రంలో ఆనంద్ చక్రపాణి, రఘురామ్, భానుప్రకాష్, నేహాల్ ఆనంద్ కుంకుమ, రాగ్ మయూర్ ముఖ్యపాత్రలు పోషించారు. సుకుమార్ రైటింగ్స్, గోపీటాకీస్ సంస్థలతో కలిసి మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, యలమంచిలి రవిశంకర్, శేష సింధురావు నిర్మించారు.

# ప్రేక్షకుల్ని థ్రిల్ చేసే 'హత్య'



'మధ' వంటి సైకలాజికల్ థ్రిల్లర్‌తో అందరినీ మెప్పించిన దర్శకురాలు శ్రీ విద్య బసవ 'హత్య' అనే మరో థ్రిల్లర్ మూవీతో ప్రేక్షకులను మెప్పించటానికి సిద్ధమవుతున్నారు. ఈ చిత్రం ఈనెల 24న రిలీజ్‌కి రెడీ అవుతోంది. ఈ సినిమాను మహాకాళ్ పిక్చర్స్ పతాకంపై ఎస్. ప్రశాంత్ రెడ్డి నిర్మిస్తున్నారు. ధన్య బాలకృష్ణ, పూజా రామచంద్రన్, రవి వర్మ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ మూవీ టీజర్ లాంచ్ వేడుక గురువారం జరిగింది. నటుడు రవివర్మ చేతుల మీదుగా టీజర్ విడుదలైంది. ఈ సందర్భంగా దర్శకురాలు శ్రీవిద్య బసవ మాట్లాడుతూ, "మధ' తరువాత థ్రిల్లర్ జోనర్‌లోనే రెండో సినిమా కూడా చేస్తున్నాను. ఇది అందరికీ తెలిసిన కథే అయినప్పటికీ గ్రిప్పింగ్‌గా, సీట్ ఎడ్జ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ మూవీగా అలరించేలా తెరకెక్కించాను. చాలా హార్డ్ వర్క్, ఎఫర్ట్స్ పెట్టి స్క్రీన్ ప్లే రాసుకుని చేసిన సినిమా ఇది. ఈ ప్రయాణంలో నాకెంతో సపోర్ట్ చేసిన నటీనటులు ధన్య బాలకృష్ణ, రవివర్మ, పూజా రామచంద్రన్ సహా అందరికీ థ్యాంక్స్. నరేష్ అద్భుత మైన బీజీఎంను అందించాడు. అభిరాజ్ విజువల్స్ చక్కగా కుదిరాయి. అనిల్ ఎడిటింగ్ సినిమాను మరింత క్యూరియస్‌గా మార్చింది. మా నిర్మాత ప్రశాంత్‌కి థ్యాంక్స్. ప్రేక్షకులు సినిమాను ఆదరించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. "మధ' సినిమా టీజర్ చూడగానే నేను శ్రీవిద్యకు కాల్ చేశాను. నేను కూడా సినిమాలో భాగం అవుతానని అన్నాను. చాలా చిన్న పాత్ర ఉందని చెప్పింది. నాకు నేనుగా వెళ్లి ఆ సినిమాలో యాక్ట్ చేశాను. అప్పుడు ఆమెతో ప్రారంభమైన ఆ జర్నీ ఇప్పుడు ఈ సినిమాలో ప్రధాన పాత్రలో నటించేలా చేసింది. రొటీన్‌కు భిన్నమైన రోల్‌ను శ్రీవిద్య నన్ను లుక్ టెస్ట్ చేసి ఎంపిక చేసింది. ఇది నాకొక ఛాలెంజింగ్ రోల్. శ్రీవిద్య కొత్త టైప్ ఆఫ్ మేకింగ్‌కి తెర తీసింది. సినిమా అందరినీ ఎంగేజ్ చేసే ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్. ఆడియెన్స్‌కు డిఫరెంట్ ఎక్స్‌పీరియెన్స్‌నిస్తుంది' అని నటుడు రవివర్మ చెప్పారు.

# ఆడపిల్లను కాపాడుకుందాం



మంచి సందేశంతో రూపొందించిన 'నిన్ను నన్ను కన్న ఆడది.. రా' పాటను రాష్ట్ర మంత్రి సీతక్క విడుదల చేశారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ "ఒక అద్భుతమైన ఆలోచనతో సమాజంలో మార్పు తీసుకురావడానికి ఈ పాట చేసిన రమణా రెడ్డి, ఆలీకి కృతజ్ఞతలు. కామంతో కళ్ళు మూసుకునిపోయి మృగంలా ప్రవర్తించే వారిలో మార్పు రావాలి. కులం, మతం, వృత్తితో సంబంధం లేకుండా అత్యాచారాలు జరుగుతున్నాయి. ఇప్పటికే వీటిని అరికట్టడానికి ప్రభుత్వం తరుపున ప్రయత్నం చేస్తున్న సమయంలో ఈ పాట ఒక మంచి తొలి అడుగులా కనిపిస్తుంది. ఈ పాట అందరిలో మార్పును తీసుకొస్తుందని కోరుకుంటున్నాను. మనం అందరం ఆడపిల్లను కాపాడుకుందాం-"అని అన్నారు. ఆలీ మాట్లాడుతూ "ఈ పాట చేయడానికి ముఖ్య కారణం మనం ప్రస్తుతం బయట చూస్తున్న పరిస్థితులు. క్యాన్సర్ కంటే దారుణంగా వ్యాపిస్తుంది ఈ రేప్ అనే వ్యాధి. నాకు ఈ పాట వినగానే యమలీల సినిమాలోని పాట గుర్తొచ్చింది. దర్శకుడు రమణా రెడ్డి ఇక్కడ నుండి అమెరికా వెళ్లి మన దేశానికి ఏమైనా చేయాలని అనుకుని తిరిగి వచ్చి ముందుగా ఈ పాటతో మొదలు పెట్టాడు. పాట విన్న వెంటనే నేను ఈ పాటని మన రాష్ట్రానికి, ఆడవారికి అంకితం చేయాలని అనుకున్నాము. ఈ పాట పూర్తిగా అన్ని చానల్స్, ఆడియో కంపెనీలకు ఉచితం. కేవలం మంచి అనేది అందరికీ వెళ్ళాలి అనే ఉద్దేశంతో చేశాం"అని తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు రమణారెడ్డి, బీఆర్కే న్యూస్ అధినేత బొల్లా రామ కృష్ణ, నటుడు శ్రీనివాస్, నటి మంజుల, జుబేదా ఆలీ తదితరులు పాల్గొన్నారు.

# సినిమాలపై కంగనా సంచలన నిర్ణయం



కంగనా రనౌత్ నటించిన "ఎమర్జెన్సీ" ట్రైలర్ కు మంచి రెస్పాన్స్ వస్తోంది. ఇప్పటికే పలు సార్లు వాయిదా పడిన ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. కాగా ఈ సినిమా తర్వాతి ప్రాజెక్టులపై కంగనా సంచలన నిర్ణయం తీసుకుంది. దీంతో ఫ్యాన్స్ షాక్‌కు గురవుతున్నారు. బాలీవుడ్ నటి కంగనా రనౌత్ కథానాయికగా నటించిన 'ఎమర్జెన్సీ' సినిమా రిలీజ్ ట్రైలర్ ఇటీవల విడుదలైంది. దీనికి చాలా మంచి రెస్పాన్స్ వస్తోంది. ప్రియాంక గాంధీకి కూడా ఈ ట్రైలర్ బాగా నచ్చిందని కంగనా సినిమా ప్రమోషన్లలో చెప్పుకొచ్చింది. ఎమర్జెన్సీ సినిమా పక్కా పొలిటికల్ కథ. ఈ సినిమా విడుదలకు కంగనా చాలా కష్టాలు పడాల్సి వచ్చింది. అందుకే సమీప భవిష్యత్తులో రాజకీయాలకు సంబంధించిన కథలు చేయకూడదని ఆమె నిర్ణయించుకుంది. 'ఎమర్జెన్సీ' సినిమాపై సెన్సార్ బోర్డు అభ్యంతరం వ్యక్తం చేసింది. సెన్సార్ సర్టిఫికేట్ ఇచ్చేందుకు మొదట నిరాకరించింది. పంజాబ్‌కు చెందిన శిరోమణి అకాలీదళ్ కూడా సినిమాపై వ్యతిరేకత వ్యక్తం చేసింది. సినిమా సిక్కు సమాజాన్ని అవమానించేలా ఉందని ఆరోపించారు. ఈ క్రమంలోనే కంగనా తన తదుపరి ప్రాజెక్ట్‌ల గురించి మాట్లాడింది. 'మరోసారి రాజకీయ ఆలోచనలతో సినిమాలు చేయను. ఇలాంటి చిత్రాలు తీయడం చాలా కష్టమైంది. కథపై, ముఖ్యంగా ప్రజల గురించి ఎక్కువ సినిమాలు ఎందుకు తీయలేదో ఇప్పుడు నాకు తెలిసింది. అనుమప్ ఖేర్ యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్ చిత్రాన్ని రూపొందించారు. ఇది అతని బెస్ట్ సినిమా. కానీ, మళ్లీ ఇలాంటి సినిమాలు చేయను. ఈ సినిమా విజయం సాధించినప్పటికీ భవిష్యత్తులో రాజకీయ కథాంశాలతో కూడిన సినిమాలు చేయను' అని కంగనా చెప్పుకొచ్చింది. దీంతో ఆమె కామెంట్స్ ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో హాట్ టాపిక్ గా మారాయి. కాగా ఇప్పుడు సినిమాలతో పాటు కంగనా ఎంపీగా బిజీ బిజీగా ఉంటున్నారు. మర్జెన్సీ సినిమాలో కంగనా నటించడంతో పాటు దర్శకత్వం కూడా వహించింది. నిర్మాతగా కూడా వ్యవహరిస్తోంది. 'సెట్‌లో నేనెప్పుడూ సహనం కోల్పోలేదు. మీరే నిర్మాతగా ఉన్నప్పుడు సెట్‌లో సహనం కోల్పోతారా? నిర్మాతతో దర్శకుడు కొట్లాడుతాడు. కానీ, రెండు పనులూ నువ్వే చేస్తున్నప్పుడు అరవలేవు' అంటోంది కంగనా.